జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాపాలన
NEWS IS RIGHT
Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*
https://prajapalana.com/epaper.php

చదవండి... చదివించండి... చందాదారులుగా చేరండి...
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన
న్యూస్ ఈజ్ రైట్
6-2-29/3/12, 3వ అంతస్థు,
దౌలత్ ప్లాజా, లక్డీకాపూల్, హైదరాబాద్ - 004
వివరాలకు సంప్రదించండి : 8886022523

సంపుటి 14 సంచిక 353 విశాఖపట్నం | మంగళవారం 07 సెప్టెంబరు 2021 | 8 పేజీలు | వెల : 5.00



## రాజ్‌నాథ్, అమిత్‌షా, దోవల్‌తో మోడీ కీలక భేటీ

న్యూఢిల్లీ,సెప్టెంబరు 06, ప్రజాపాలన ప్రతినిధి: అఫ్గనిస్తాన్‌లో జరుగుతున్న పరిణామాలను భారత ప్రభుత్వం నిశితంగా పరిశీలిస్తూనే ఉంది. ఇప్పటికే కేంద్ర విదేశాంగ శాఖతో పాటు ఇతర సీనియర్ అధికారులు ఎప్పటికప్పుడు సమాచారాన్ని సేకరిస్తూనే ఉన్నారు. తాజాగా ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం ఓ కీలక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ హాజరయ్యారు. అఫ్గనిస్తాన్‌లో జరుగుతున్న ప్రస్తుత, తాజా పరిణామాలపై వీరు చర్చించినట్లు తెలుస్తోంది.

## మళ్లీ వర్షాకాలం వచ్చేలోగా ...

# రోడ్లన్నింటినీ బాగుచేయాలి: జగన్



అమరావతి,సెప్టెంబరు 06, ప్రజాపాలన ప్రతినిధి: రోడ్లు, పోర్టులు, ఎయిర్‌పోర్ట్‌ల నిర్మాణంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో సోమవారం సమీక్ష చేపట్టారు. ఆర్‌అండ్‌బి, పెట్టుబడులు, మౌలిక వసతుల శాఖలపై సీఎం సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ.. "అక్టోబరు మాసానికల్లా వర్షాలు తగ్గుముఖం పడతాయి. తర్వాత పనుల కాలం మొదలవుతుంది. ముందుగా రోడ్లను బాగుచేయడంపై దృష్టిపెట్టండి. మళ్లీ వర్షాకాలం వచ్చేలోగా రోడ్లన్నింటినీ బాగుచేయాలి. మన ప్రభుత్వం వచ్చిన తర్వాత రోడ్లపై ప్రత్యేక దృష్టిపెట్టాం. గత ప్రభుత్వంలో రోడ్లను పూర్తిగా విడిచిపెట్టారు" అని పేర్కొన్నారు. ''మనం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి ఏడాదీ వర్షాలు మంచిగా పడ్డాయి. దేవుడి దయవల్ల వర్షాలు బాగా పడ్డం వల్ల రైతులు సంతోషంగా ఉన్నారు. వర్షాలు పడ్డం వల్ల మరోవైపు రోడ్లు కూడా దెబ్బతిన్నాయి. రోడ్లను బాగుచేయడనికి ఈ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. వనరుల సమీకరణలో అనేక చర్యలు తీసుకుంది. ఒక నిధిని కూడా ఏర్పాటు చేసింది" అని సీఎం జగన్ తెలిపారు. "దురదృష్టవశాత్తూ ఒక్క చంద్రబాబుతోనే కాదు పచ్చమీడియాతో మనం యుద్ధం చేస్తున్నాం. ముఖ్యమంత్రి పీఠంలో చంద్రబాబు లేకపోవడంతో వీరు జీర్ణించుకోలేకపోతున్నారు. అందుకనే ప్రతి విషయంలో వక్రీకరణలు చేస్తున్నారు. ఇవన్నీ ఉన్నాకూడా, నెగెటివ్ ఉద్దేశంతో ప్రచారం చేసినా.. మనం చేయాల్సిన పనులు చేద్దాం. ఈ ప్రచారాన్ని పాజిటివ్‌గా తీసుకుని అడుగులు ముందుకేద్దాం. మనం బాగా పనిచేసి పనులన్నీ పూర్తిచేస్తే... నెగెటివ్ మీడియా ఎన్నిరాసినా ప్రజలు వాటిని గమనిస్తారు. మనం బాగుచేశాక ప్రజలు ప్రయాణించే రోడ్లే దీనికి సాక్ష్యాలుగా నిలబడతాయి'' అన్నారు సీఎం జగన్. రోడ్లను బాగుచేయడానికి ఇప్పటికే చాలావరకూ టెండర్లు పిలిచారు. మిగిలిన చోట్ల కూడా ఎక్కడైనా టెండర్లు పిలవకపోతే వెంటనే టెండర్లు పిలవండి. అక్టోబరులో వర్షాలు ముగియగానే పనులు మొదలుపెట్టేలా చర్యలు తీసుకోండి. క్షేత్రస్థాయి నుంచి నివేదికలు తెప్పించుకోండి. మరొకసారి నిశితంగా వాటిని పరిశీలించండి. నివేదికలు ఆధారంగా ఫోకస్ పెట్టి వాటిని బాగుచేయండిసంబంధిత ప్రభుత్వ విభాగాలతో కలిసి కూర్చుని కార్యాచరణచేయాలని సీఎం జగన్ ఆదేశించారు. ఈ సమావేశంలో గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి ఎం శంకరనారాయణ, పరిశ్రమలు, వాణిజ్యం, ఐటీ శాఖ మంత్రి మేకపాటి గౌతం రెడ్డి, ఏపీ మారిటైం బోర్డు ఛైర్మన్ కె వెంకటరెడ్డి, సీఎస్ ఆదిత్యనాథ్ దాస్, పరిశ్రమలశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కరికాల వలవెన్, ఆర్ అండ్ బీ ముఖ్య కార్యదర్శి ఎం టీ కృష్ణబాబు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ ఎం ఎం నాయక్, ఆర్థికశాఖ కార్యదర్శి ఎన్ గుల్జార్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## ఉద్ధవ్ థాకరే సంచలన నిర్ణయం

ముంబై,సెప్టెంబరు 06, ప్రజాపాలన ప్రతినిధి: మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఉద్ధవ్ థాకరే సంచలన నిర్ణయం తీసుకున్నారు. అన్నిసామాజిక, మత, రాజకీయ సమావేశాలను రద్దు చేస్తూ ఆదేశాలిచ్చారు. జనసమీకరణల కారణంగా రాష్ట్రంలో కోవిడ్ కేసులు పెరిగే అవకాశాలు బలంగా ఉన్నాయంటూ నిపుణులు సూచించిన నేపథ్యంలో థాకరే సర్కార్ తాజా నిర్ణయం తీసుకుంది. ప్రజల ఆరోగ్యానికే ప్రథమ ప్రాధాన్యమని, వేడుకలు తరవాతనైనా జరుపుకోవచ్చని ఉద్ధవ్ థాకరే పేర్కొన్నారు. "మనం పండుగలు తరువాత చేసుకుందా. ప్రజలు ప్రాణాలు, ఆరోగ్యానికి తొలి ప్రాధాన్యం ఇద్దాం. రోజువారీ కేసులు పెరుగుతుండటంతో పరిస్థితి చేయి దాటిపోయే ప్రమాదం ఉంది" అని ఉద్ధవ్ హెచ్చరించారు.

(మిగతా 2లో..)

## మతాల మధ్య సోము వీర్రాజు చిచ్చు: వెల్లంపల్లి



విజయవాడ,సెప్టెంబరు 06, ప్రజాపాలన ప్రతినిధి: బీజేపీ నేతలు మత రాజకీయాలు మానుకోవాలని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ హితవు పలికారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, సోము వీర్రాజు మతాల మధ్య చిచ్చుపెట్టే విధంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కేంద్రం ఆదేశాలతో వినాయక చవితి వేడుకలపై నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. సోము వీర్రాజు కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలకు వ్యతిరేకంగా పని చేస్తున్నారని దుయ్యబట్టారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కులమతాలకతీతంగా పాలన చేస్తున్నారన్నారని మంత్రి అన్నారు. బీజేపీ నేతలకు హిందూమతంపై గౌరవం ఉంటే గతంలోనే ప్రశ్నించేవారని, ఆలయాలను కూల్చిన టీడీపీని బీజేపీ ఏనాడూ ప్రశ్నించలేదని మంత్రి వెల్లంపల్లి ధ్వజమెత్తారు. "వినాయక చవితి చేసుకోవద్దని మేం చెప్పలేదు. దీనిపై బీజేపీ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. మతం ముసుగులో

(మిగతా 2లో..)

## సీఎం జగన్‌ను కలిసిన నటుడు మంచు మనోజ్



అమరావతి,సెప్టెంబరు 06, ప్రజాపాలన ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సినీ హీరో మంచు మనోజ్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ విషయాన్ని మనోజ్ ట్విటర్ వేదికగా పంచుకున్నారు. "సీఎం జగన్‌ను కలవడం నాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నా. భవిష్యత్తు కోసం ఆయన చేస్తున్న ప్రణాళికలు.. ముందుచూపు, దూరదృష్టి నన్ను బాగా ఆకర్షించాయి. రాష్ట్ర అభివృద్ధి పట్ల మీకున్న దార్శనికతకు ముగ్ధుడినయ్యాను. మంచి చేస్తున్న మీలాంటి వ్యక్తికి దేవుడి ఆశీస్సులు ఎల్లప్పుడు ఉండాలని కోరుకుంటున్నా. మీ పరిపాలనకు ఇవే నా శుభాకాంక్షలు " అని ట్వీట్ చేశారు.

## సీఎం జగన్ విజన్‌కు అనుగుణంగా పనిచేయాలి: సజ్జల



విజయవాడ,సెప్టెంబరు 06, ప్రజాపాలన ప్రతినిధి: రాష్ట్ర సాంఘిక సంక్షేమ మండలి చైర్మన్‌గా పులి సునీల్ కుమార్ సోమవారం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, మంత్రి ఆదిమూలపు సురేశ్, ఎంపీలు అవినాష్ రెడ్డి, నందిగం సురేష్, డిప్యూటీ సీఎం అంజాద్ భాష, ప్రభుత్వ విప్ వెన్నపూస వేణుగోపాల్ రెడ్డి, చీఫ్ విప్ శ్రీనివాసులు, కడప మేయర్ సురేష్ బాబు పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ ఛైర్మన్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ..."వైఎస్ జగన్ ఆశయాలకు, విజన్‌కు అనుగుణంగా కార్పొరేషన్ ఛైర్మన్లు పనిచేయాలి. అట్టడుగు వర్గాలకు సామాజిక న్యాయం చేస్తున్నారు. మంత్రివర్గ కూర్పులోనూ సీఎం జగన్ సామాజిక న్యాయం పాటించారు. నామినేటెడ్ పోస్టుల్లోనూ సామాజిక న్యాయం పాటించారు. అట్టడుగు వర్గాల ప్రజలు తమ కాళ్ళమీద తాము నిలబడేలా చేస్తున్నారు. దళితులకు న్యాయం చేసేందుకు దళితుల నుంచే నాయకులను తయారు చేస్తున్నారు. గతంలో పైరవీలు చేసినవారికి, డబ్బులు ఇచ్చిన వారికి పదవులు వచ్చాయి. కానీ జగన్ కష్టపడినవారిని గుర్తించి పదవులు ఇస్తున్నారు. అతి తక్కువ జనాభా ఉన్న కులాలను గుర్తించి వారికి పదవులు ఇస్తూ ఔన్నత్యాన్ని కాపాడుతున్నారు. కొంతమందికి న్యాయం చేయలేకపోయామనేది వాస్తవం. కచ్చితంగా అందరికీ న్యాయం జరుగుతుంది." అని తెలిపారు.

## సీజనల్ వ్యాధులపై అధికారులతో ఆళ్ల నాని సమీక్ష



గుంటూరు,సెప్టెంబరు 06, ప్రజాపాలన ప్రతినిధి: సీజనల్ వ్యాధులపై ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య శాఖ మంత్రి ఆళ్ల నాని అధికారులతో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హోం మంత్రి మేకతోటి సుచరిత, ఎమ్మెల్యేలు ముస్తఫా, మద్దాలి గిరిధర్, కిలారి రోశయ్య, ఉండవల్లి శ్రీదేవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఆళ్ల నాని మాట్లాడుతూ.. "ప్రభుత్వం సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉంది. ఎక్కడైతే డెంగ్యూ, మలేరియా వ్యాధులు ఎక్కువ వస్తున్నాయో.. అక్కడ ప్రత్యేక దృష్టి పెట్టాలి. ప్రత్యేకంగా శానిటేషన్ డ్రైవ్ నిర్వహించాలి" అన్నారు. "జ్వరాలకు సంబంధించిన సర్వే చేయాలి. ఏ ప్రాంతంలో అయితే ఎక్కువగా వ్యాధులు నమోదవుతున్నాయో ఆ ప్రాంతంలో జ్వరాలకు సంబంధించిన నిర్ధారణ పరీక్షల శిబిరాలను ఏర్పాటు చేయాలి. ఆ ప్రాంతంలోనే ప్రత్యేకంగా జ్వరాల ట్రీట్మెంట్‌కి సంబంధించిన స్పెషల్ క్యాంపులు ఏర్పాటు చేసి వైద్యం అందించాలి" అని ఆళ్ల నాని సూచించారు. "మురికివాడలు, ఏజెన్సీ ప్రాంతాల్లో అధికారులు కూడా అప్రమత్తంగా ఉండాలి. ఎప్పటికప్పుడు నీరు నిల్వ ఉండకుండా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలి. సీజనల్ వ్యాధులను మానిటరింగ్ చేయడానికి జిల్లాకు ఒక ప్రత్యేక అధికారి నియమించాం. ఆరోగ్యశాఖ మున్సిపల్ పంచాయితీ శాఖలకు సంబంధించిన అధికారులు సమన్వయంతో పని చేయాలి. మందులు అందుబాటులో ఉంచాలి. ఎక్కడైనా ప్రైవేట్ హాస్పిటల్స్‌లో అధిక ఫీజులు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటాం" అని ఆళ్ల నాని తెలిపారు.

"మీరు గౌరవప్రదమైన జీవితాన్ని గడపాలని విశ్వసిస్తే,
మీరు స్వయం సహాయాన్ని నమ్ముతారు, ఇది ఉత్తమ సహాయం"
—డా. బి.ఆర్ అంబేడ్కర్
BUSINESS v/s SOCIAL ENGINEERING
20 సంవత్సరాల స్నేహ గ్రూప్ ప్రయాణం
వ్యాపారమా...? లేక సోషల్ ఇంజనీరింగా...?
మీరే చెప్పండి
BUSSINESS
వ్యాపారం ద్వారా వచ్చే లాభాన్ని పార్ట్నర్స్ గాని డైరెక్టర్ గాని పంచుకోవడాటాన్ని వ్యాపారం (Bussiness) అంటారు
SOCIAL ENGINEERING
సంస్థ నిర్వహించే కార్యకలాపాల ద్వార వచ్చే లాభం మొత్తాన్ని సొసైటీ మార్పు కోసం,పేదల అభివృద్ధి కొరకు,విద్య కొరకు,ఆరోగ్యం కొరకు వాడటాన్ని సోషల్ ఇంజనీరింగ్ అంటారు.
స్నేహ చిట్స్ లో కంపెనీకి వచ్చే లాభాల్ని చారిటీకి వాడుతూ మెంబర్స్‌కు వచ్చే లాభాలను మెంబర్స్‌కు ఇవ్వటం జరుగుతోంది
అంబేడ్కర్ టీవీ నిర్మాణం కొరకు స్నేహ మ్యాక్స్ లో డిపాజిట్ చేసిన వారందరికీ వారికి ఇవ్వాల్సిన ఇంట్రెస్ట్ (Interest)ని ఇచ్చి ఆ డిపాజిట్ ని మెంబర్స్‌కి అప్పులు ఇచ్చి,రికవర్ చేసిన తర్వాత వచ్చే లాభాల మొత్తాన్ని అంబేడ్కర్ టీవీ ఛానల్‌ను నడపటానికి వినియోగిస్తున్నాం
అంబేడ్కర్ టీవీ ఛానల్
సామాజిక దృక్పథంతో బహుజన సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి, తద్వారా పరిష్కారమార్గంలోకి తీసుకెళ్లడానికి ప్రయత్నం చేస్తుంది
మహిళలు సాధించిన పురోగతి స్థాయి ద్వారా నేను సమాజ పురోగతిని కొలుస్తాను.
—డా. బి.ఆర్ అంబేడ్కర్
జై పూలే జై భీమ్ జై బహుజన జై భారత్

# కరకట్టపై సచివాలయ భవన నిర్మాణానికి నిరసన

చీరాల(ఒంగోలు) సెప్టెంబరు 06, ప్రజాపాలన ప్రతినిధి: : చీరాల మండలం ఈపూరుపాలెం రెండో సచివాలయ భవన నిర్మాణాన్ని, ఇంతకుముందు కేటాయించిన స్థలంలోనే చేపట్టాలంటూల, వివిధ రాజకీయ పార్టీలు సోమవారం చీరాల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశాయి. గత తాసిల్దార్ ఇందుకోసం స్థలాన్ని కేటాయించి, దాన్ని పంచాయతీరాజ్ శాఖకు అప్పగించాక కూడా, అక్కడ కాకుండా తాజాగా కరకట్టపై ఈ భవన నిర్మాణాన్ని చేపట్టడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని వారు తెలిపారు. అంతేగాక కరకట్టపై ఈ భవన నిర్మాణానికి వీలుగా, అక్కడ చాలాకాలంగా ఉన్న 20కుటుంబాలను వేరేచోటకు తరలించారన్నారు. ఆ 20కుటుంబాలకు స్మశానం పక్కన నివేశన స్థలాలు ఇవ్వగా, అది మా సొంత స్థలం అంటూ , కొందరు వారిని అక్కడికి రానివ్వడం లేదని చెప్పారు. దీంతో ఆ కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. అసలు కరకట్టలపై శాశ్వత భవనాలు కట్టకూడదన్నారు. గతంలో కరకట్టపై నిర్మించారని కారణం చూపి, చంద్రబాబు కట్టిన ప్రజావేదికను, జగన్ ప్రభుత్వం కూల్చేసిన ఉదంతాన్ని వారు గుర్తు చేశారు. ఇప్పుడు ఈపూరుపాలెంలో కరకట్టపై ఎలా ప్రభుత్వ భవనాన్ని నిర్మిస్తారని వారు నిలదీశారు. అసలు ఎందుకు గతంలో కేటాయించిన స్థలంలో సచివాలయ భవనాన్ని నిర్మించరని ప్రశ్నించారు. ఈ విషయంలో అధికారులు పునరాలోచన చేసి, ఆ ప్రయత్నాలు విరమించుకోకుంటే, న్యాయపోరాటం చేస్తామని, ప్రజా




ఉద్యమానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ మహమ్మద్ హుస్సేన్ కు వినతిపత్రం సమర్పించారు. వివిధ పార్టీలు, ప్రజా సంఘాల నేతలు బత్తుల శ్యామ్యూల్, సయ్యద్ బాబు, గుమ్మడి ఏసురత్నం, మేడ వెంకట్రావు, బాబూరావు, ఊటుకూరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



## ఉన్నతస్థాయికి ఎదిగేలా ప్రోత్సహించేది గురువే

**– రోటరీక్లబ్ ఆఫ్ చీరాల అధ్యక్షులు దోగుపర్తి వెంకటసురేష్**

**– రోటరీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు ఘన సన్మానం**



చీరాల(ఒంగోలు) సెప్టెంబరు 06, ప్రజాపాలన ప్రతినిధి: : జీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగేలా, మార్గదర్శకత్వం చేసి ప్రోత్సహించేది గురువేనని, ఉపాధ్యాయుల రుణం తీర్చుకోలేనిది అని రోటరీక్లబ్ ఆఫ్ చీరాల అధ్యక్షులు దోగుపర్తి వెంకటసురేష్ అన్నారు. ఈ సందర్భంగా చీరాల ఇంజనీరింగ్ కళాశాలల సీఈవో వలివేటి మురళీకృష్ణ, తదితర పలువురు వక్తలు మాట్లాడుతూ, ఉపాధ్యాయ స్థాయి నుండి రాష్ట్రపతి స్థాయికి ఎదిగిన, సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితాన్ని , నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ చీరాల ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా, రోటరీ క్లబ్ సభ్యులుగా ఉన్న ఉపాధ్యాయులు ముద్దన రఘు కుమార్, ప్రతాప్, శివాంజనేయ ప్రసాద్, చుక్కా శ్రీనివాసరావు, ప్రభాకర్ విశ్వకర్మ, బాలవెంకటేశ్వరరావు, విక్టర్ రవికుమార్, పొట్టి శ్రీనివాసరావు తదితర ఎనిమిది మంది ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ చీరాల అధ్యక్షులు దోగు పర్తి వెంకట సురేష్, కార్యదర్శి పోలుదాసు రామకృష్ణ, గుర్రం రాఘవరావు, కరణం శ్రీనివాస బాబు, వలివేటి మురళీకృష్ణ, రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## ఉద్ధవ్ థాకరే సంచలన నిర్ణయం

(మొదటి పేజీ తరువాయి)

సోమవారంనాడు జరిగిన 'డిజాస్టర్ మేనేజిమెంట్' సమావేశంలో థాకరేతో పాటు సీనియర్ మంత్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా థాకరే మాట్లాడుతూ, పండుగలు, మతపరమైన కార్యక్రమాలపై ఆంక్షలు విధించడానికి ఎవరు మాత్రం ఇష్టపడతారు? అయితే ప్రజల ప్రాణాలు చాలా ముఖ్యం" అని అన్నారు. దీనికి ముందు వర్చువల్‌గా జరిగిన మహా డాక్టర్ కాన్ఫరెన్స్ ప్రారంభోపన్యాసంలో సీఎం మాట్లాడుతూ, ఆలయాలు, సంస్థలు, ప్రదేశాలు తెరవాలని ప్రజలు నిరసన తెలపవద్దని కోరారు. కొందరు తమ వ్యాపార సంస్థలు తెరవాలని తొందరపడుతున్నారని, అయితే వారిని వేచిచూడాలని తాము కోరుతున్నామని, ఒకవేళ తెరిచినా పరిస్థితి విషమిస్తే తిరిగి మూసివేయక తప్పదని అన్నారు. కాగా, థర్డ్ వేవ్ కనుక వస్తే 60 లక్షల కేసులు నమోదయ్యే అవకాశాలున్నాయని ఆరోగ్య శాఖ మంత్రి రాజేష్ టోపె హెచ్చరించారు. మొదటి వేవ్‌లో 20 లక్షల కేసులు, రెండో వేవ్‌లో 40 లక్షల కేసులు చూశామని, థర్డ్ వేవ్ వచ్చిన పక్షంలో సునామీ తరహాలో 60 లక్షలకు కేసులు చేరే అవకాశాలున్నాయని అన్నారు.

## అత్యంత ఘనంగా గురుపూజోత్సవ వేడుకలు



చీరాల(ఒంగోలు)సెప్టెంబరు 06, ప్రజాపాలన ప్రతినిధి: : చీరాల మండలం ఈపూరుపాలెం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో గురుపూజోత్సవ వేడుకలు అత్యంత ఘనంగా సోమవారం సాయంత్రం జరిగాయి. ఆట పాటలతో ఉపాధ్యాయులు సందడి చేశారు. ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి ఉపాధ్యాయులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఉపాధ్యాయ వృత్తికే విలువ తెచ్చిన మహనీయుడు రాధాకృష్ణన్ అని పేర్కొన్నారు. ఉపాధ్యాయ దినోత్సవ ప్రాధాన్యత గురించి ఉపాధ్యాయులు ప్రసంగించారు. స్కూల్ హెడ్ మిస్ట్రెస్ జి. రత్నావళిని ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. అనంతరం హైస్కూల్ సీనియర్ టీచర్లు దాసరి నిర్మలాదేవి,రామకృష్ణ, ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాస రెడ్డిలకు హెడ్ మిస్ట్రెస్,సహ ఉపాధ్యాయులు శాలువాలు కప్పి సన్మానం చేశారు. చివరగా నిర్మలాదేవి ఆధ్వర్యంలో జరిగిన ఆటల పోటీలలో గెలుపొందిన ఉపాధ్యాయులకు బహుమతి ప్రదానం జరిగింది.

## మతాల మధ్య సోము వీర్రాజు చిచ్చు: వెల్లంపల్లి

(మొదటి పేజీ తరువాయి)

రాజకీయాలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రభుత్వంపై మతం పేరుతో బురద చల్లేందుకు ప్రయత్నిస్తున్నారు. కుల,మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం. కేంద్రం ఇచ్చిన గైడ్ లైన్స్ మేరకే గణేశ్ ఉత్సవాలపై నిర్ణయం తీసుకున్నాం. కేంద్ర ప్రభుత్వమే కోవిడ్ గైడ్‌లైన్స్ ఇచ్చింది.గైడ్‌లైన్స్ మార్చమని కేంద్రాన్ని అడగండి. కుల,మతాల రాజకీయాలు చేసే ప్రభుత్వం మాది కాదు. కోవిడ్ నిబంధనలు పాటిస్తూ పండుగ చేసుకోమని చెప్పాం. దయ చేసి ప్రజలను రెచ్చగొట్టొద్దు. వినాయక చవితి అందరి పండుగ పెద్ద విగ్రహాలు, ఊరేగింపులు పెట్టకూడదని మాత్రమే సూచించాం. మత విద్వేషాలతో లబ్ధి పొందాలని చూడొద్దని" మంత్రి హితవు పలికారు.

## 108 కేజీల పులిహోరతో తిరుప్పావడ

**– అత్యంత వైభవంగా శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణం**



చీరాల(ఒంగోలు) సెప్టెంబరు 06, ప్రజాపాలన ప్రతినిధి: : చీరాల అమరావారి వీధిలో ఉన్న శ్రీ లక్ష్మీ భవనం నందు, శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణం, అత్యంత వైభవంగా కన్నుల పండువగా జరిగింది. శ్రీ వెంకటేశ్వర స్వామి గానామృతంని భక్తులు ఎంతో శ్రద్ధగా ఆలపించారు.అనంతరం 108 కేజీల పులిహోర తో నిర్వహించిన తిరుప్పావడ సేవ కార్యక్రమం, ప్రజలను భక్తిపారవశ్యంలో ముంచెత్తింది. చీతిరాల.యలమంద, వెంకటలక్ష్మి దంపతులు, సౌమ్య, సాయి శ్రీనివాస్ లు, కళ్యాణ మహోత్సవం, తిరుప్పావడ సేవ ల,ఉభయ దాతలుగా వ్యవహరించగా, శ్రీ లక్ష్మీ భవన సమాజ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. దేవతా మూర్తులకు విశేష అలంకరణ చేసి, భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. కార్యక్రమాన్ని కమిటీ అధ్యక్షులు వల్లంపట్ల శివసుబ్రమణ్యం, కార్యదర్శి కూనిశెట్టి శ్రీనివాసరావు, కోశాధికారి మేడా బాలకృష్ణమూర్తి, ఉపాధ్యక్షులు పచ్చిపులుసు కృష్ణ ప్రసాదరావు, ఉప కార్యదర్శి నాగవరపు వెంకటేశ్వరరావు, ఉప కోశాధికారి వల్లంశెట్టి శ్యాం ప్రసాద్, కమిటీ సభ్యులు, హాజరైన భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా, కోవిడ్ నిబంధనలు పాటిస్తూ, కార్యక్రమాన్ని నిర్వహించారు.

## పరారీలో ఉన్న గంజాయి స్మగ్లర్లు అరెస్ట్



పర్చూరు(ఒంగోలు) సెప్టెంబరు 06, ప్రజాపాలన ప్రతినిధి: : తప్పించుకు తిరుగుతున్న ఇద్దరు గంజాయి స్మగ్లర్లను ఇంకొల్లు పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. గత నెల 30 వ తేదీన ఇద్దరు గంజాయి స్మగ్లర్లను ఇంకొల్లు పోలీసులు పట్టుకోవటం తెలిసిందే. ఆ సమయంలో వారి వాహనానికి పైలట్ గా వ్యవహరిస్తూ కారులో ముందు వెళ్లిన ఇద్దరు వ్యక్తులు పోలీసులను చూసి కారు వదిలి పరారయ్యారు. అప్పటినుండి ఇంకొల్లు సీఐ సుబ్బారావు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం విస్తృతంగా గాలింపు జరిపి పరారీలో ఉన్న బాలకృష్ణప్ప అనే తమిళనాడు వాసిని, వినయ్ అనే తెలంగాణ రాష్ట్ర వాసిని సోమవారం మధ్యాహ్నం మూడు గంటలకు పర్చూరు రోడ్డులో అరెస్టు చేశారని చీరాల డిఎస్పి శ్రీకాంత్ మీడియాకు చెప్పారు. వారి వద్ద నుండి నాలుగు కిలోల గంజాయిని స్వాధీన పరుచుకున్నారు. ఈ కేసులో చాకచక్యంగా దర్యాప్తు చేసి నిందితులను పట్టుకున్న ఇంకొల్లు సీఐ సుబ్బారావు ఎస్సై.ప్రసాద్, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు. వారికి రివార్డులకు సిఫార్సు చేస్తామని తెలిపారు.

## ప్రొబేషన్ డిక్లరేషన్ పూర్తి చేసి పే స్కేల్ వర్తింప చేయాలి: డబ్ల్యు ఈ ఎ

**ప్రొబేషన్ పూర్తి అయ్యే సమయంలో పరీక్షలా**



వేటపాలెం, సెప్టెంబర్ 6 (ప్రజాపాలన ప్రతినిధి): అక్టోబర్ 2 నాటికి రెండు సంవత్సరాలు సర్వీసు పూర్తి చేసుకొన్న తమకు ఎటువంటి పరిక్షలు లేకుండా ప్రొబేషన్ డిక్లరేషన్ పూర్తి చేసి పే స్కేల్ వర్తింప చేయాలని సంక్షేమ, విద్యా సహాయకులు స్థానిక ఎంపిడివో కె. నేతాజీకి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వేటపాలెం 3వ సచివాలయ వెల్ఫేర్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్ రాజశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన ఎపిపిఎస్సి పరిక్షలు వ్రాసి ఉత్తీర్ణత సాధించిన రెండు సంవత్సరాల సర్వీసు పూర్తి చేసిన తరువాత ప్రొబేషన్ పూర్తి అయ్యే సమయంలో మరళ డిపార్ట్మెంట్ టెస్టు పుస్తకాలు లేకుండా నిర్వహిస్తామనడం అన్యాయమన్నారు. సాధారణంగా డిపార్ట్మెంట్ టెస్ట్ లంటే పుస్తకాలతో నిర్వహిస్తారని తమకు మాత్రమే నిబంధన మార్చడం సరికాదన్నారు. ప్రభుత్వ పథకాలు అందించుటలో ప్రధాన భూమిక నిర్వహిస్తూ పాఠశాలల తనిఖీ విధుల నుండి ఇతరత్రా విదులు నిర్వహిస్తూ, ప్రభుత్వ పథకాలను సజావుగా ప్రజలకు అందించేందుకు అవిరళ కృషి చేస్తున్నామని. నెలలోపే ఎపిపియస్సి ద్వారా నిర్వహించే పరీక్షలు వ్రాయాలని తప్పనిసరి చేయటం అందున ఎలాంటి పుస్తకాలు లేకుండా వ్రాయ మనటం అన్యాయమని తమ ఆవేదనను వెలిబుచ్చారు. కార్యక్రమంలో నాంచారయ్య, భార్గవ్, అంజనీ కృష్ణ, మౌనిక, తదితర సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## పౌష్టికాహారం తీసుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యం - మాజీ ఎంపిపి గవిని శ్రీనివాసరావు



చీరాల(ఒంగోలు) సెప్టెంబరు 06, ప్రజాపాలన ప్రతినిధి: : పౌష్టికాహారం క్రమం తప్పకుండా తీసుకుంటే, సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని, మహిళలు, బాలింతలు, గర్భవతులు, పిల్లలు క్రమం తప్పకుండా ,పౌష్టికాహారం తీసుకోవాలని, మాజీ ఎంపీపీ గవిని శ్రీనివాసరావు అన్నారు. చీరాల మండలం తోటవారి పాలెం సెక్టార్, గవినివారిపాలెం పంచాయతీ పుల్లాయ పాలెం అంగన్వాడీ కేంద్రంలో, పౌష్టికాహార మాసోత్సవం కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రభుత్వసంక్షేమ ఫలాలు, అర్హులైన లబ్ధిదారులకు అందేలా చూడాలన్నారు. గర్భం ధరించినప్పటి నుండి బిడ్డ పుట్టిన 24 నెలల వరకు క్రమం తప్పకుండా, మంచి పౌష్టికాహారాన్ని తల్లీబిడ్డ తీసుకోవాలని, సూపర్ వైజర్ సజ్జా పుష్పవల్లి తెలిపారు. అనంతరం మొక్కలు నాటే కార్యక్రమం గర్భవతులకు సీమంతం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. చిరుధాన్యాలతో పిండి వంటలు చేసే విధానం చేసి, తల్లులకు చూపి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జాలారావు, అచ్యుతంబ, ఏఎన్‌యం.రాజ్యలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తల ప్రసన్న, మాణిక్యం, శివపార్వతి, లక్ష్మీ తిరుపతమ్మ, మేరీ, కనకదుర్గ, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

## రాయలసీమలో అతి పెద్ద అత్యాధునిక జిమ్నాషియంగుత్తి లో ఏర్పాటు



అనంతపురం,సెప్టెంబరు 06, ప్రజాపాలన ప్రతినిధి: గుత్తి పట్టణంలో సామాన్య ప్రజలకుచేరువులో అత్యాధునిక జిమ్నాషియంఏర్పాటు చేయడమైనది. ఈ జిమ్నాషియంరాయలసీమలోనే అతి పెద్దది గా అవతరించనుంది. కేవలం పెద్ద నగరాలకేకాదు మునిసిపాలిటీ, పెద్ద పంచాయితీలలో కూడా ఆరోగ్యం శారీరిక వ్యాయామముఈ ప్రాంతప్రజలకుఆరోగ్యంతో పాటు మంచి ఆహారఅలవాట్లు, అలాగే శరీరానికి దోహద పడే యోగ, వ్యాయాయం సామాన్య ప్రజలకు తెలియచేయడం తమ విధి అని జిమ్ నిర్వాహకులు లయన్ డాక్టర్ ఎం విరూపాక్ష రెడ్డి గారు తెలిపారు.ప్రజలకుఅత్యాధునిక జిమ్ ఏర్పాటు చేయడం అభినందించ తగ్గ విషయం అలాగే జీవన శైలి లో మార్పులు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని. లైఫ్ స్టయిల్‌డిసిజేస్ అయిన ఒబెసిటీ, బి పి, షుగర్, అలాగే మానసిక సమస్యలు ఇతరత్రా వ్యాధులు శారీరిక వ్యాయాయం ద్వారా దూరమవుతాయని ప్రజా సైన్స్ వేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సురేష్ బాబు తెలిపారు. గుత్తి పట్టణంలో ఇంతపెద్ద ఎత్తున ప్రజలఆరోగ్యం కోసం జిమ్ ఏర్పాటు చేస్తున్న విరూపాక్ష రెడ్డి గారికి కృత్ఞతలుతెలిపిన లయన్స్ క్లబ్ కార్యదర్శి శ్రీనాథ్, మరి కొద్ది రోజులల్లో ఫోర్ట్ వ్యూ ఫార్మ్ హౌస్ వెంచర్లో ప్రకృతి వైద్య చికిత్సాలయాలనుఏర్పాటు చేయనున్నట్లు వేద ఇన్ఫ్రా సియండి తెలిపారు. అత్యాధునిక వసతులతో ఫార్మ్ హౌస్ ఏర్పాటు చేసి ప్రజలను ప్రకృతితో మమేకం చేయడం తమ ఉద్దేశం అని శ్రీనాథ్ తెలిపారు.

## యువతను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులదే కీలక పాత్ర: మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ కొరబండి సురేష్



చీరాల(ఒంగోలు) సెప్టెంబరు 06, ప్రజాపాలన ప్రతినిధి: : దేశ భవితయువత చేతుల్లోనే ఉందని, నేటి యువతను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దడంలో, ఉపాధ్యాయులదే కీలక పాత్ర అని, మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ కొరబండి సురేష్ అన్నారు. ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా, చీరాల తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి యడం బాలాజీ ఆధ్వర్యంలో, బాలాజీ కార్యాలయంలో, టీడీపీ నాయకులు ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని ఉపాధ్యాయులు, రావుల ముకుంద, గండి మురళి కృష్ణ, గాదిరాజు రవి వెంకట రమణ, బొందూ రవిలను సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కొరబండి సురేష్, బుదాటి వెంకటరావు, కర్ణ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## సెయింట్ ఆన్స్ కాలేజ్‌లో ఎచీవర్స్ డే వేడుకలు

చీరాల(ఒంగోలు) సెప్టెంబరు 06, ప్రజాపాలన ప్రతినిధి: : చీరాల సెయింట్ ఆన్స కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజిలో, మంగళవారము ఎచీవర్స్ డే వేడుకలను నిర్వహిస్తున్నట్లు, కళాశాల సెక్రటరి వనమా రామకృష్ణా రావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు సంయుక్తముగా ఒక ప్రకటనలో తెలియజేశారు. ఎచీవర్స్ డే కార్యక్రమమునకు, ప్రకాశం జిల్లా ఎస్.పి మలికాగార్గ్ ముఖ్య అతిథిగా విచ్చేస్తున్నట్లు, కళాశాల ప్రధాన ఆచార్యులు మొయిద వేణుగోపాలరావు తెలిపారు. ఈ కార్యక్రమములో 2021 సం.నందు, ప్లేస్ మెంట్ ఆఫర్స్, ఇంటర్న్ షిప్ మరియు గేట్ ర్యాంకులు పొందిన కళాశాల విద్యార్థులకు, జిల్లా ఎస్.పి.మలికాగార్గ్ ద్వారా అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమమునకు ప్లేస్ మెంట్ ఆఫర్స్, ఇంటర్న్ షిప్ మరియు గేట్ ర్యాంకులు పొందిన కళాశాల విద్యార్థులు హాజరు కావలసినదిగా కళాశాల ప్రధాన ఆచార్యులు తెలిపారు.

# హైవే పై జరిగిన కేసు చేదించిన ప్రకాశం జిల్లా పోలీసులు

ఒంగోలు, సెప్టెంబరు 06, ప్రజాపాలన ప్రతినిధి: ప్రకాశం జిల్లా, గుడ్లూరు హైవే పై జరిగిన డేకాయిటి కేసుపై తక్షణవే స్పందించి పిర్యాదు అందిన 48 గంటల్లోనే కేసును ఛేదించటంలో చొరవ చూపిన ప్రకాశం జిల్లా ఎస్పీ మలిక గర్గ్, పిర్యాది,నిచ్చేనమెట్ల చిరంజీవి సన్నాఫ్, జగన్నాథం, వయస్సు 42 సంవత్సరాలు,క ,నెల్లూరు ముద్దాయిలు.

1.తాతా నాగరాజు సన్నాఫ్ , వెంకటేశ్వర్లు, వయస్సు 35 సంవత్సరాలు, ఇనమడుగు గ్రామము, కోవూరు మండలం, నెల్లూరు జిల్లా

2. బద్దిపూడి శ్రీనివాసులు సన్నాఫ్ హాజరత్తయ్య , 30 వయసు , ఇనమడుగు గ్రామము, కోవూరు మండలం, నెల్లూరు జిల్లా

3. కొరివి సుధాకర్ సన్నాఫ్ , రమణయ్య , 38 సంవత్సరాలు, సిద్దయ్య మఠం రోడ్ , కడప జిల్లా.

4.బుర్రి గోపి కృష్ణ సన్నాఫ్, కృష్ణయ్య, వయసు 22 సంవత్సరాలు, వరికుంట గ్రామం, అట్లూరు మండలం , కడప జిల్లా.

5.పెద్దేటి సుబ్బరాయుడు సన్ ఆఫ్ సుబ్బయ్య, వయస్సు 38 సంవత్సరాలు, కుంభ గిరి గ్రామం, అట్లూరు మండలం, కడప జిల్లా.

6. దొరబాబు కళ్యాణ్ సన్నాఫ్ రమణ దొరబాబు, వయస్సు 36 సంవత్సరాలు, కులము %ఎ.వీ. =% నగర్, నెల్లూరు జిల్లా.

7.మారెళ్ళ నవీన్ ప్రసాద్ సన్నాఫ్ నాగరాజు, వయస్సు 43 సంవత్సరాలు పరంధమయ్య కాంప్లెక్స్, అశోక్ నగర్, బద్వేల్ టౌన్ , కడప జిల్లా .

రికవరీ నగదు: 47,00,000, ఇన్నోవ కారు , స్కార్పియో కారు మరియు కత్తి

కేసు వివరాలు: ఫిర్యాదుదారు చిరంజీవి నెల్లూరులోని జ్యుయలరీ దుకాణం యజమాని మరియు తరచుగా బంగారం కొనుగోలు చేయడానికి విజయవాడకు వెళతారు. తేది ఆగస్టు నెల ముప్పై ఒక్కటీ మంగళవారం న తన కారు లో బంగారం కొనుగోలు చేయడానికి మరో ఇద్దరితో కలిసి విజయవాడకు బయలుదేరాడు మరియు అతను గుడ్లూరు పి.ఎస్ పరిదిలో ని శాంతినగర్ ప్రాంతానికి చేరుకున్నప్పుడు, ఖాకీ ప్యాంట్లు ధరించిన ముగ్గురు వ్యక్తులు ఎన్ హెచ్-16పై, తన కారును ఆపి,



కారు తాళాలను లాగి, ఫిర్యాదుదారుడు భారీ మొత్తం లో అక్రమ డబ్బును తీసుకువెళు తున్నట్లు తమ వద్ద సమాచారం ఉందని చెప్పారు. వారు అతన్ని డిఎస్పి కార్యాలయానికి రావాలని కోరారు మరియు అతన్ని కేసు లేకుండా విడిచిపెట్టడానికి 25,00,000, డిమాండ్ చేశారు. ఫిర్యాదుదారుడు అంగీకరించి డబ్బుఉన్న కవర్ జేబు లో తెరుస్తుండగా వారిలో ఒకరు.50,00,000, ఉన్న కవర్ ను లాక్కొని వారి ఇన్నోవా కారులో వెళ్లిపోయారు,

ఈ విషయాన్ని ఎవరికీ వెల్లడించరాదని వారు ఫిర్యాదుదారుడిని కత్తి తో బెదిరించారు. ఫిర్యాదుదారుడు సెప్టెంబర్ ముడు శుక్రవారం న గుడ్లూరు పి.ఎస్.కు వచ్చి ఈ సంఘటన గురించి నివేదిక ఇచ్చాడు. గుడ్లూరు పోలీసులు కేసు నమోదు చేసి, పై అధికారులకు సమాచారం అందించారు.

ప్రకాశం జిల్లా ఎస్పీ మలిక గర్గ్, దీనిని ప్రతిష్టాత్మకం గా తీసుకొని ఈ కేసును వ్యక్తిగతం గా పర్యవేక్షించి, ఈ కేసును వెంటనే చేదించాలని కందుకూరు డి.ఎస్.పి, ని ఆదేశించారు. సి.ఐ.కందుకూరు పర్యవేక్షణ లో గుడ్లూరు, ఉలవపాడు, పి సి, పల్లి ఎస్.ఐ. ల తో మూడు బృందాలు ఏర్పాటు చేయబడ్డాయి. బృందాలు నేర స్థలాన్ని సందర్శించి భౌతిక మరియు సాంకేతిక సాక్ష్యాలను సేకరించారు. వారు టోల్ గేట్స్ నుండి మొత్తం డేటాను సేకరించారు. సాంకేతికపరి జ్ఞానాన్ని ఉపయోగించడం ద్వారా కేసును జాగ్రత్త గా దర్యాప్తు చేశారు. సెప్టెంబర్ ఆరు,

న, ఎనిమిది గంటలకు సి.ఐ. కందుకూరు మరియు అతని బృందం ఈ కేసు లో ఏడు మంది నిందితులను నెల్లూరు - బద్వేలు రోడ్ లోని పాముదు జంక్షన్ వద్ద , అరెస్టు చేశారు. నిందితుల వద్ద నుంచి పోలీసు బృందం.47,00, 000. స్వాధీనం చేసుకున్నారు. నేరం లో ఉపయోగించిన రెండు వాహనాలను ఇన్నోవా కార్ మరియు స్కార్పియోను కూడా స్వాధీనం చేసుకున్నారు. కడప జిల్లా బద్వేలుకు చెందిన జర్నలిస్ట్, యుూట్యూబ్ అయిన ఎ-5 సుబ్బరాయుడు స్వాధీనం నుంచి చేతి కత్తిని కూడా స్వాధీనం చేసుకున్నారు.

ఈ కేసులో ఎ-2, శ్రీనివాస్ ఫిర్యాదుదారుడి కారు డ్రైవర్ గా పనిచేస్తున్నట్లు దర్యాప్తు లో వెల్లడించారు. ఎ- 1 నాగరాజుకు నెల్లూరు జిల్లాలో గత నేర చరిత్ర ఉంది మరియు వారు బంధువులు. నాలుగు క్రిమినల్ కేసులు ఎ-1లో పెండింగ్ లో ఉన్నాయి. కడప జిల్లా అట్లూరు పోలీస్ స్టేషన్ లో పోలీస్ కానిస్టేబుల్ గా పనిచేస్తున్న ఎ-3 కె.సుధాకర్ తో కలిసి వారు కుట్ర పన్నారు. ఒక క్రిమినల్ కేసు నిమిత్తం అట్లూరు పి.ఎస్.కు హాజరవుతున్నప్పుడు, వారికి పరిచయం అయ్యారు. బంగారం కొనుగోలు చేయడాని కి తన యజమాని చిరంజీవి ఆగస్టు నెల ముప్పై ఒక్కటీ, న డబ్బు తో విజయవాడవెళుతున్నట్లు ఏ-2 శ్రీనివాన్ ఏ-1, ఏ-3లకు సమాచారం అందించాడు. ఎ-3 కానిస్టేబుల్ సుధాకర్ బద్వేలుకు చెందిన ఎ-4 గోపి, యొక్క ఇన్నోవా కారును అద్దెకు తీసుకున్నారు. సోషల్ మీడియా జర్నలిస్ట్ ఎ-5 సుబ్బరాయుడును మరియు ఎ-7 నవీన్ ను కూడా సహాయం అడిగారు . ఈ నేరాన్ని అమలు చేయడానికి తన స్నేహితుడు వారందరూ ఆగస్టు ముప్పై ఒక్కటీ మంగళవారం, తెల్లవారుజామున నెల్లూరుకు వచ్చి ఎ-1 మరియు ఎ-2లను కలుసుకుని వారి ప్రణాళికను అమలు చేయడం ప్రారంభించారు. నిందితులందరూ ఫిర్యాదుదారుడిని రెండు వాహనాల్లో ఇన్వోవా మరియు స్కార్పియో అనుసరించారు. ఫిర్యాదుదారు కారు కావలి టోల్ గేట్ వద్దకు చేరుకున్నప్పుడు, నిందితుడు ఫిర్యాదుదారుని వాహనాన్ని దాటి వారి ప్రణాళికను అమలు చేయడానికి శాంతినగర్ సమీపం లో వేచి ఉన్నారు.నిందితుల్లో ముగ్గురు ఖాకీ ప్యాంట్స్ లో వలె పోలీసు వ్యక్తులుగా, నటించి ఫిర్యాదుదారుని కారును ఆపి వారి ప్రణాళికను అమలు చేసి .50,00,000, తీసుకెళ్లారు.వారు తమ రెండు వాహనాల్లో నేరం జరిగిన ప్రదేశం నుండి తప్పించుకున్నారు.ప్రకాశం జిల్లా ఎస్పీ మలిక గర్గ్ , ఈ సంచలనాత్మక కేసును స్వల్పవ్యవధి లో చేదించినందుకు కందుకూరు సబ్ డివిజన్ పోలీసు బృందాన్ని ప్రశంసించారు మరియు కష్టపడి పనిచేసిన, అంకితభావం చూపించిన బృందానికి కందుకూరు డిఎస్పీ కె.శ్రీనివానరావు, కందుకూరు సిఐ వి.శ్రీరామ్ , గుడ్లూరు ఎస్ ఐ, కె.మల్లికార్జున రావు , పి.సిపల్లి ప్రేమ్ కుమార్ , గుడ్లూరు ఏ ఎస్ ఐ,మురళీ ధార్ , సిబ్బంది కి ఎస్పీ అభినందించి వారి కి సర్టిఫికెట్లు మరియు క్యాష్ రివార్డ్ ను అందచేసినారు.

## పార్టీ విజయంకోసం సమిష్టికృషి చేయాలి: తెదేపా అధ్యక్షుడు కె.అచ్చెన్నాయుడు

భీమవరం, సెప్టెంబర్ 6 (ప్రజాపాలన ప్రతినిధి) : సోమవారం మంగళగిరిలోని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో భీమవరం నియోజకవర్గ సమీక్షా సమావేశం నిర్వహించారు. నరసాపురం పార్లమెంట్ తెలుగుదేశంపార్టీ అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి ఆధ్వర్యంలో తెలుగుదేశంపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరపు అచ్చంనాయుడు అధ్యక్షతన భీమవరం అసెంబ్లీ నియోజకవర్గ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరపు అచ్చెన్నాయుడు భీమవరం నియోజకవర్గ పార్టీ సంస్థాగత గ్రామ, వార్డు, మండల, పట్టణ కమిటీల పనితీరు ఇన్చార్జ్ లేక కోఆర్డినేటర్ల నియామకాల గురించి ఒక్కొక్కరితో మాట్లాడి వారి అభిప్రాయాల్ని తీసుకున్నారు. అనంతరం పార్టీ నిర్ణయించిన వారికి ఇన్చార్జ్ లేక కోఆర్డినేటర్ నియామకం జరుగుతుందని అందరూ సమిష్టికృషితో పార్టీ విజయానికి కృషిచేయాలని ఆయన దిశానిర్దేశం చేశారు.రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారధి ఈ సమావేశంలో తెలుగు మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మెరగాని నారాయణమ్మ, ఏఎంసీ మాజీ చైర్మన్ కోళ్ల నాగేశ్వరరావు, టౌన్ కన్వీనర్ వేంద్ర శ్రీనివాస్, కార్యనిర్వాహక కార్యదర్శి మాదాసు కనకదుర్గ, నాయకులు వీరవల్లి చంద్రశేఖర్, రేవు వెంకన్న, వీరవల్లి శ్రీనివాస్, ఎద్దు ఏసుపాదం, ఎంఏ నౌషాద్, మైలబత్తుల హైజాక్ బాబు, ఉప్పులూరి చంద్రశేఖర్, తమ్మినీడి నాగేశ్వరరావు, నీలాతి రమేష్, రాయపల్లి వెంకట్, కోళ్ల నాగబాబు, అడిదెల చిరంజీవి, ఎర్రంశెట్టి శ్రీనివాస్, బొడ్డు పూర్ణచందర్రావు, చెల్లబోయిన గోవింద్, గునుపూడి తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.

## దళితులపై జరిగే దాడులపై ఎస్సీ కమీషన్ తక్షణమే చర్యలు చేపట్టాలి: డీబీ హెచ్ పీయస్ రాష్ట్ర అధ్యక్షులు డా.గోదా రమేష్ కుమార్

నరసరావుపేట, సెప్టెంబరు 06, ప్రజాపాలన ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ లో దళితులపై జరుగుతున్న దాడులపై దళిత మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు,హత్యలపై రాష్ట్ర ఎస్సీకమీషన్ స్పందించి తక్షణమే చర్యలు చేపట్టాలని దళిత బహుజనుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు డా.గోదా రమేష్ కుమార్ ఆంధ్రప్రదేశ్ ఎస్సీ కమీషన్ ఛైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ ను సోమవారం విజయవాడలో గల రాష్ట్ర ఎస్సీ కమీషన్



ఛైర్మన్ కార్యాలయంలో కలసి వినతిపత్రం సమర్పించారు.అనంతరం రొంపిచర్ల మండలం నల్లగార్లపాడులోని అంబేద్కర్ నగర్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో రమేష్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్సీల అభివృద్ధి కొరకు కొనసాగుతున్న 17 రకాల పథకాలను ప్రభుత్వం రద్దు చేసిందని ఆయా పథకాలను కొనసాగే విధంగా తక్షణమే చర్యలు చేపట్టాలని,ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసులలో బాధితులకు నష్టపరిహారం అందేవిధంగా మరియు కేసులలో నిందితులకు వెంటనే శిక్షలు పడే విధంగా పోలీస్ అధికారులు విచారణను వేగవంతంచేసే విధంగా ఆదేశించాలని రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారిన విద్యార్థిని రమ్య హత్య కేసును ఎస్సీ కమీషన్ సుమోటోగా స్వీకరించి త్వరగా నిందితునికి శిక్షపడేలా చర్యలు చెపట్టాలని పెండింగ్ లో ఉన్న ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసుల విచారణ వేగవంతం చేయాలని కోరామని రమేష్ కుమార్ తెలిపారు.ఈ కార్యక్రమంలో డీబీహెచ్ పీయస్ నాయకులు శ్రీనివాసరావు,నాగేశ్వరరావు,అంజయ్య,విజయ్ తదితరులు పాల్గొన్నట్లు తెలిపారు.

# నగుళ్ళ, కనకదుర్గలకు ఘన సత్కారం

### మంత్రి కొడాలి నానిని మర్యాదపూర్వకంగా కలిసిన కార్పోరేషన్ డైరెక్టర్లు

గుడివాడ, ప్రజాపాలన ప్రతినిధి సెప్టెంబర్ 6: రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) ను ఏపీ టూరిజం డెవలప్ మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ గా నియమితులైన నగుళ్ళ సత్యనారాయణ, ఏపీ స్టేట్ బ్రాహ్మిణ్ కార్పోరేషన్ డైరెక్టర్ గా నియమితులైన



తుర్లపాటి కనకదుర్గలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సోమవారం కృష్ణాజిల్లా గుడివాడ పట్టణం రాజేంద్రనగర్లోని నివాసంలో నగుళ్ళ సత్యనారాయణ, తుర్లపాటి కనకదుర్గలకు మంత్రి కొడాలి నాని పుష్పగుచ్ఛాలను అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్పోరేషన్ డైరెక్టర్లుగా నియమితులైన నగుళ్ళ, కనకదుర్గలు మాట్లాడుతూ తమపై ఎంతో విశ్వాసంతో అప్పగించిన పదవులకు న్యాయం చేస్తామన్నారు. ఆయా కార్పోరేషన్ల ద్వారా ప్రజలకు సేవలందిస్తామని చెప్పారు. కార్పోరేషన్ డైరెక్టర్లుగా నియమించిన సీఎం జగన్మోహనరెడ్డి, మంత్రి కొడాలి నాని, వైసీపీ రాష్ట్ర నేత దుక్కిపాటి శశిభూషణ్ కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మంత్రి కొడాలి నాని మాట్లాడుతూ గతంలో మాదిరిగా నామినేటెడ్ పదవులు అలంకార ప్రాయం కాదని చెప్పారు. సీఎం జగన్మోహనరెడ్డి ప్రభుత్వం ఎంతో బాధ్యతాయుతంగా పనిచేస్తోందన్నారు. నామినేటెడ్ పదవులను పొందిన వారికి కూడా అంతే బాధ్యత ఉంటుందన్నారు . ప్రజల జీవన ప్రమాణాలను పెంపొందించేందుకు కార్పోరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు పనిచేయాలని సూచించారు. డైరెక్టర్ గా తుర్లపాటి కనకదుర్గలను నియమించడం పట్ల మంత్రి కొడాలి నాని హర్షం వ్యక్తం చేస్తూ, వారికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ గుడివాడ రూరల్ మండల అధ్యక్షుడు మట్టా జాన్ విక్టర్, నాయకులు తుర్లపాటి రవి, మొండ్రు వెంకటేశ్వరరావు, పిళ్ళా శేఖర్, గొరుముచ్చు సురేష్, చిట్టి, కాళ్ళకూరి హరిప్రసాద్, అగస్త్యరాజు కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

## వినాయక విగ్రహాల ఏర్పాటు కు అనుమతులు ఇవ్వాల్సిందే:భాజాపా



కావలి సెప్టెంబర్ 6 ప్రజాపాలన ప్రతినిధి :వినాయక చవితి పండుగకు వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు ఇవ్వాల్సిందేనని భాజాపా నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఆర్డిఓ శీనా నాయక్ కు వినతిపత్రం అందజేశారు. కందుకూరి సత్యనారాయణ మాట్లాడుతూ కావలి నియోజకవర్గానికి మంత్రులు పర్యటనలు చేసినప్పుడు , వైస్సార్ వర్ధంతి వేడుకలు చేసుకున్నప్పుడు కరోన రాదా అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం వినాయక చవితిని జరుపుకోకూడదని ఆంక్షలు విధించడం సరైన ధోరణి కాదని ,హిందువుల మనోభావాలను దెబ్బతీసేవిధంగా కుట్రలు చేస్తున్నారని వాపోయారు.పర్మిషన్ ఇచ్చిన ,ఇవ్వకపోయినా వినాయక చవితి పండుగను కరోన నిబంధనలతో జరుపుకుంటామని తెలిపారు.భాజాపా పట్టణ అధ్యక్షుడు కుట్టబోయిన బ్రహ్మానందం ,అంచపాక కమల ,సుభాషిణి ,వంశీ ,బాలు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## 'స్పందన' కు గైర్హాజరైన అధికారులపై చర్యలు



నరసాపురం, సెప్టెంబరు6 (ప్రజాపాలన ప్రతినిధి) :స్పందన కార్యక్రమానికి వివిధశాఖల అధికారులు ఖచ్చితంగా హాజరుకావాలని గైర్హాజరు అయిన అధికారులపై చర్యలు తీసుకుంటామని నరసాపురం సబ్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ హెచ్చరించారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్పందన కార్యక్రమంలో సోమవారం డివిజన్లోని వివిధ గ్రామాలనుంచి వచ్చిన ప్రజలనుంచి సుమారు 40 పిర్యాదులను సబ్ కలెక్టర్ స్వీకరించారు. ప్రతిఅర్జీని ఆయన పూర్తిగాచదివి పిర్యాదుదారుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారియొక్క ఫిర్యాదులను సంబధిత అధికారులకు పంపి వాటిని త్వరితగతిన పరిష్కరిస్తామని వారికి సబ్ కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కె.ఆర్.సి.తహశీల్దార్, ఏ.వో ఆర్.వి. కృష్ణారావు, వివిధశాఖలు అధికారులు పాల్గొన్నారు.


PAY BACK TO SOCIETY SNEHA CLUB

స్నేహ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటి లిమిటెడ్

SNEHA MACS

గత 20 సం॥లు గా సమాజ మార్పుకోసం కంపెనీకి వచ్చే లాభాలను పేదప్రజల కనీస అవసరాల కోసం ఖర్చు చేస్తూ సోషల్ ఇంజనీరింగ్ చేస్తున్నాం.

SCHEDULE OF INTEREST RATES ON FIXED & R.D. ACCOUNTS

| Term | General | Senior Citizens |
|---|---|---|
| 180 Days - 1 Year | 7% | 7.5% |
| 1 Year - 2 Years | 8% | 8.5% |
| 2 Years - 3 Years | 9% | 9.5% |
| 3 Years - 5 Years | 10% | 10.5% |
| Above 5 Years | 11% | 11.5% |
| Savings Bank A/c | 5% | 5% |
| Recurring Deposit | 6% | 6.5% |

J.B. RAJU, IIS, vrs
Ambassador
Dr. B.M. Vinod Kumar IFS Retd
Nerella Koteswara Rao DGM vrs BSNL
Dr. Guduri Seethamaha Lakshmi
M. Padma Sarma D.E. vrs BSNL
G. Kenny Bob

Dr. N. Venkateswarlu
Principal Retd, Govt. Dental College
P.M. Raju. Chief Engineer, Retd
A. Punna Rao
Chief Manager, Retd, Canara Bank
Arepally Rajendar DGM vrs, NTPC
S. Rama Krishna

Chairman : Dr. K. Siva Bhagya Rao, IRS vrs

CONTACT :
Hyderabad 76600 27682, 7842106355
Visakhapatnam 0891-2791205, 9246663046, 7660027696, 7660027664
Vijayawada 76600 27670, 900062111
Tirupathi 94400 77239
Bapatla 94403 20562
Ponnur 99089 91763
Cherukupalli 79958 56068
Karlapalem 76600 27676

H.No. 6-29/3/12, 3rd Floor, Daulat Plaza, Lakdikapul, Hyderabad - 500 004
E-mail : snehamacsltd@gmail.com

# ప్రజాపాలన

**సంపాదకీయం**

**మంగళవారం 07, సెప్టెంబరు 2021**


## అట్టడుగు వర్గాలకు అక్షర కాంతులు

ప్రపంచాన్ని మార్చే బలమైన ఆయుధం విద్య మాత్రమే అని నెల్సన్ మండేలా చెప్పిన మాటలు అక్షర సత్యం. ఈ సిద్ధాంతాన్ని బలంగా విశ్వసిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న విద్యా రంగ సంస్కరణలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయి. దీనిలో భాగంగా ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన ప్రైవేటు స్కూళ్లు, కాలేజీల ఫీజుల ఖరారు, ప్రైవేటు విశ్వవిద్యాలయాలలో 35 శాతం సీట్లు పేదలకు కేటాయింపు చేయాలనే నిర్ణయాలు ఎంతో దార్శనికతతో తీసుకున్నవిగా స్పష్టమవుతున్నాయి.ఏపీ ప్రభుత్వం నాడు-నేడు పథకంలో భాగంగా, పాఠశాల విద్యార్థులకు ఉపయుక్తంగా అందిస్తున్న జగనన్న కిట్‌లు మధ్యతరగతి, పేద విద్యార్థులకు వరంగా మారాయి. ప్రభుత్వ పాఠశాలల స్వరూపాన్ని మార్చుచేసే విధంగా 44,512 పాఠశాలలను అభివృద్ధి చేయాలని నిర్ణయించడం, తొలి దశలో రూ. 3,625 వేల కోట్లతో 15,715 పాఠశాలలను అద్దంలా, సుందరంగా తీర్చిదిద్ది విద్యార్థులకు అందించిన విధానం నభూతో న భవిష్యతి అన్న చందంగా సాగింది. ప్రధానంగా గతంలో గ్రామాలలో నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా నిలచిన పాఠశాలలకు నాడు-నేడు పథకంలో పుష్కలంగా నిధులు సమకూర్చి అభివృద్ధి చేసిన విధానం పల్లె ప్రజల మనసులను చూరగొంది. పనుల్లో పారదర్శకతను పాటిస్తూ తమ పాఠశాలను తామే అభివద్ధి చేసుకునే స్వేచ్ఛను ప్రభుత్వం కల్పించింది. పాఠశాల చిన్నారులను ఆకర్షించే విధంగా రంగురంగుల వర్ణ చిత్రాలు, తరగతి గదుల్లో విద్యుత్ దీపాలు, విద్యార్థులు కూర్చునే బెంచీలు వంటి సకల వసతులను కల్పించడంతో పాటు, బాలికలకు అత్యంత ఉపయుక్తంగా నిలిచే శౌచాలయాలను నిర్మించి అందించింది. బాలికల ఆత్మగౌరవాన్ని పరిరక్షిస్తూ, హాజరు శాతం పెంపుదల చేయడానికి ఇది ఒక కారణంగా నిలుస్తుంది. గత పాలకులు పాఠశాల విద్య విషయంలో కాగితాల్లో లెక్కలకే పరిమితం అయ్యారు. ప్రస్తుత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాఠశాల స్థాయి నుంచి విశ్వవిద్యాలయ స్థాయివరకు విద్యారంగాన్ని పూర్తిస్థాయిలో నూతన పంథాలో నడిపించడానికి, ప్రపంచ అవసరాలకు అనుగుణంగా మన రాష్ట్ర విద్యార్థులను సమాయత్తం చేయడానికి కంకణం కట్టుకున్నారనే విషయం స్పష్టమవుతోంది. 'ప్రపంచంలో నిజమైన శాంతిని కోరుకుంటున్నట్లయితే మనం చిన్నారులను విద్యావంతులుగా తయారు చేయాల'న్న మహాత్మాగాంధీ వ్యాఖ్యలను నిజం చేస్తూ పాఠశాల విద్యను అందరికీ చేరువ చేసే ప్రయత్నం ఏపీలో జరుగుతోంది. దీనిలో భాగంగా తల్లిదండ్రులకు భారం కాకుండా ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో ఫీజులు ఖరారు చేయడం దేశంలోనే ఒక నూతన ఒరవడికి నాందిగా చెప్పవచ్చు. పంచాయతీ, మున్సిపాలిటీ, కార్పొరేషన్ స్థాయిలో పాఠశాలల ఫీజులు రూ. 10 వేల నుంచి 18 వేల వరకు, జూనియర్ కాలేజీలకు రూ. 12 వేల నుంచి 20 వేల వరకు ఉండాలని, అదే విధంగా హాస్టల్ రుసుములు సైతం రూ. 18 వేల నుంచి రూ. 24 వేల మధ్యలో ఉండాలని నిర్ణయించారు. విద్యను పూర్తిగా ప్రైవేటీకరించిన ప్రస్తుత రోజుల్లో ప్రభుత్వం జవాబుదారీగా వ్యవహరిస్తూ అందరికీ విద్యను చేరువ చేసే దిశగా తీసుకున్న ఈ సాహసోపేత నిర్ణయాన్ని మనందరం స్వాగతించాల్సిన తరుణమిది. పేద విద్యార్థులకు అవకాశాల కల్పనే లక్ష్యంగా ప్రైవేటు విశ్వవిద్యాలయాల్లో 35 శాతం సీట్లను కన్వీనర్ కోటాలో భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రతిభ కలిగిన విద్యార్థులు పేదరికం కారణంగా విద్యకు దూరం కారాదనే దివంగత సీఎం వైఎస్సార్ ఆశయాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లే దిశగా ఈ నిర్ణయం నిలుస్తోంది. ప్రతిష్టాత్మకమైన ప్రైవేటు వర్సిటీలలో ప్రవేశం పొందడం వలన పేద విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుంది. జగనన్న విద్యా దీవెనతో పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్, జగనన్న వసతి దీవెనతో వసతి భోజన ఖర్చులను ప్రభుత్వమే భరిస్తూ విద్యార్థికి స్వేచ్ఛాపూరిత వాతావరణంలో విద్యను పొందే వ్యవస్థను కల్పించాలని సంకల్పించారు. ఈ విధానంలో రిజర్వేషన్ అమలు చేయడంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, బాలికలకు పూర్తిస్థాయిలో రిజర్వేషన్ అమలు జరిగి అట్టడుగు వర్గాలకు సంపూర్ణ న్యాయం చేకూరుతుంది. భవిష్యత్తులో జరిగే సంస్కరణలకు కేవలం ఇవి తొలి అడుగుగా భావించాలి. ఎంతో ఆర్థిక భారాన్ని భరిస్తూ రాష్ట్రంలో పేద, అట్టడుగు వర్గాల చిన్నారులకు విద్యను చేరువ చేయాలనే సమున్నత సంకల్పం ఎంతో అభినందనీయం. ఈ పథకాలను మరో దశాబ్ద కాలం అమలు జరిపితే ప్రతీ కుటుంబం విద్యావంతులతో సుసంపన్నం అవుతుంది. తద్వారా వారి ఆర్థిక పరిస్థితులు మెరుగుపడి, మరొకరికి చేయూతనందించే స్థాయికి చేరుకుంటారు.

## ప్రయివేటీకరణ ఉన్మాదం

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రయివేటీకరణ తాండవం చేస్తోంది. జాతి సంపదనంతా కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడితే కానీ కునుకు పట్టదన్నట్టు నయా ఉదారవాద ఉన్మాదాన్ని ప్రదర్శిస్తోంది. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని ప్రభుత్వ రంగ సంస్థలను తెగనమ్మడానికి ఒక ప్రత్యేక కార్యాచరణను ఇటీవలే నిస్సిగ్గుగా ప్రకటించిన కేంద్రం.. ఇప్పుడు గ్రామాలపైనా ప్రయివేటు కత్తి వేలాడదీసింది.

గ్రామ పంచాయితీలు స్వావలంబన సాధించాలంటే తమ పరిధిలో ఉన్న ఆస్తులను అమ్మేసుకోవాలని, రాష్ట్ర ప్రభుత్వాలు ఇందుకోసం ప్రణాళికలు రూపొందించాలని ఒత్తిళ్లకు తెరలేపింది. గ్రామసభలు తప్పనిసరిగా నిర్వహించడం, ఆ సభల్లో 12 కీలకాంశాలు చర్చించాలని సూచించింది. కేంద్రం నుంచి ఆదేశాలు అందిన తర్వాత నిర్వహించే మొట్టమొదటి గ్రామసభలోనే మానిటైజేషన్ ప్రక్రియ గురించి చర్చ చేయాలని నిర్దేశించడంలోనే కేంద్రం ఉబలాటమేంటో బోదపడుతుంది. ఆస్తిపన్ను, వృత్తిపన్ను, ఉమ్మడి ఆస్తులను లీజుకివ్వడం, సర్వీసు చార్జీలు విధించడం తదితర నగదీకరణ చర్యలపై నిర్ణయాలు చేయాలని కూడా పేర్కొంది.

కేంద్రం లెక్కలో 'ఒక మనిషి తన కాళ్లపై తాను నిలబడాలంటే తనను తాను వేరేవాళ్లకు అమ్మేసుకోవాలన్నమాట'. అది బానిస బతుకౌతుందే తప్ప సొంతకాళ్లపై నిలబడటం కాబోదు కదా. పంచాయితీలకు ఉన్న ఊరుమ్మడి ఆస్తులను అమ్మేస్తే ..వాటిని కొనుగోలు చేసిన ప్రయివేటు కంపెనీల సేవలో పునీతమవ్వడమే పంచాయితీల పనిగా మారే ప్రమాదముంది. ఈ పాటి ఇంగితం కేంద్రానికి లేకపోవడం సిగ్గుచేటు. ఊరుమ్మడి ఆస్తులుంటేనే వాటి నిర్వహణ కోసం పంచాయితీల అవసరం ఉంటుంది. ఇక ఆ ఆస్తులనే అమ్మేస్తే పంచాయితీల మనుగడేముంటుంది. ఇక స్వావలంబన ఎక్కడిది? షెడ్యూల్డు, అటవీ ప్రాంతాల్లో ఖనిజాలు, ఇతర వనరులను కొల్లగొట్టేందుకు ఇప్పటికే జిమ్మిక్కులకు పాల్పడుతున్న ప్రయివేటు కంపెనీలకు గ్రామాల్లోనూ కొనుగోళ్లకు వీలు కల్పిస్తే ధృతరాష్ట్ర కౌగిలిలో బందీకావడమే అవుతుంది. మహాత్మ గాంధీ 'గ్రామ స్వరాజ్యం' కలలను కంటే మోడీ గ్రామాలను బానిసత్వంలోకి నెడుతున్నారు.

ఇంతకాలమూ నయా ఉదారవాద విధానాలకు వత్తాసు పలికిన ఆర్థిక వేత్తలు సైతం జాతీయ మానిటైజేషన్ పైప్‌లైన్ (ఎన్ఎంపి) పట్ల అభ్యంతరాలను, వ్యతిరేకతను వ్యక్తం చేస్తున్నారంటే బిజెపి ప్రభుత్వం ఎంతటి వినాశనానికి తెరదీసిందో అర్థం చేసుకోవచ్చు. బంగారు గుడ్లు పెట్టే బాతును అత్యాశకు పోయి బలి తీసుకున్న కసాయి తరహాలో జాతి సంపదను ఇలా గంపగుత్తగా కార్పొరేట్ కంపెనీలకు బలిపెడితే భవిష్యత్ తరాలకు మిగిలేదేమిటన్న ఆర్థిక వేత్తల ప్రశ్న సహేతుకమైనదే. అయితే కేంద్రం నుంచి ఈ ప్రశ్నకు సమాధానాన్ని ఆశించలేం. ఎందుకంటే మోడీ సర్కార్ దృష్టిలో ప్రభుత్వ ఆస్తులను నిర్వహించాల్సింది వ్యాపారవేత్తలు కాని ప్రభుత్వం కాదుకదా!

పంచాయితీలంటే కేవలం లాభాలు దండుకునేందుకు ఏర్పాటు చేసిన సంస్థలు కాదని, ప్రజలకు సేవలందించేందుకు ఏర్పాటు చేసిన సంస్థలన్న సంగతి మోడీ ప్రభుత్వం మరిచిపోయింది. ఈ నేపథ్యంలో కేంద్రం చెంప చెల్లుమనేలా తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ జాతీయ మానిటైజేషన్ పైప్‌లైన్ (ఎన్ఎంపి) పట్ల తీవ్ర వ్యతిరేకత తెలిపారు. ఇది ఆహ్వానించదగ్గ పరిణామం.

కేంద్ర వినాశకర ఎత్తుగడలను తుత్తునీయులు చేయాలంటే మిగిలిన రాష్ట్రాలు కూడా ఎన్ఎంపిని వ్యతిరేకించాలి. పంచాయితీల స్వావలంబన పేరుతో మోడీ సర్కార్ ప్రతిపాదించిన గ్రామాల మానిటైజేషన్ విధానాన్ని తిరస్కరించాలి. గ్రామ పంచాయతీలకు నిధులు కేటాయించే రాజ్యాంగ బద్ధ బాధ్యత నుండి తప్పుకునే కుతంత్రం కూడా కేంద్ర ప్రతిపాదనలో దాగుందన్న సంగతి గుర్తుంచుకోవాలి. గ్రామ సచివాలయాలు ద్వారా గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేసేందుకు కృషి చేస్తున్నామంటున్న రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం తీరును నిరసించాలి. పంచాయతీరాజ్ శాఖకు కేంద్రం పంపిన ప్రతిపాదనలను తిరస్కరించి గ్రామాల్లోని ఉమ్మడి సంపదను పరిరక్షించుకోవాలి. కేంద్ర వినాశకర విధానాలకు వ్యతిరేకంగా విశాల పోరాటాల్లో ప్రజలంతా భాగస్వాములు కావాలి.

# భారత్ మేల్కొనాల్సిన సమయం ఇదే!



చైనా, పాకిస్తాన్ మన సరిహద్దుల్లో ప్రమాద ఘంటికలు మోగిస్తున్న నేపథ్యంలో అణ్వాయుధాలను సైతం 'మొదటగా ప్రయోగించం' అనే విధానాన్ని భారత్ ఇప్పటికైనా వదిలేయాలన్న ఆలోచనలకు బలం చేకూరుతోంది. లద్దాఖ్ అనుభవాల తర్వాత భారత్ యుద్ధంలో నేరుగా చైనాను ఢీకొట్టే పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలో భారత అణు విధానం ఎలా ఉండాలి? సంప్రదాయ రీతుల్లోనూ పీఎల్ఏ ఎత్తులకు పై ఎత్తులు వేయడం ఎలా? పీఎల్ఏ తరహాలో భారత మిలటరీలో సంస్కరణలు చేపట్టడం ఎలా? రక్షణ పరంగా ఈ ప్రశ్నలకు సమాధానాలు వెతకడంలో ఆలస్యం జరిగేందుకు వీల్లేదు. చైనాతో లద్దాఖ్ లడాయి ఇంకా ముగియలేదు. అక్కడ సుమారు వెయ్యి చదరపు కిలోమీటర్ల భారత భూభాగాన్ని ఆక్రమించిన పొరుగు దేశం మన మిలటరీ శక్తి సామర్థ్యాలను పరీక్షకు నిలపడమే కాకుండా... అణ్వస్త్ర నిరోధకతపై భారత విదేశాంగ విధానంలోని డొల్లతనాన్నీ బట్టబయలు చేసింది. ఆ మాటకొస్తే భారత్ అణ్వాయుధాలు తనకో లెక్కే కాదన్న చందంగా చైనా వ్యవహరిస్తోంది. 1998 మే 11, 13 తేదీల్లో భారత్ వరుసగా ఐదు అణు పరీక్షలు నిర్వహించిన సందర్భాన్ని ఇక్కడ గుర్తు చేసుకోవాల్సి ఉంటుంది. అప్పట్లో ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి, అమెరికా అధ్యక్షుడు బిల్ క్లింటన్‌కు ఒక లేఖ రాశారు. చైనా, పాకిస్తాన్ కుమ్మక్కై అణు పరీక్షలు నిర్వహిస్తున్న కారణంగానే భారత్ కూడా అణు పరీక్షలు నిర్వహించాల్సి వచ్చిందని ప్రస్తావించడమే కాకుండా... భారత్ ముందస్తు అణ్వస్త్ర ప్రయోగం చేయదని హామీ కూడా ఇచ్చారు. ఈ విధానాన్ని ప్రస్తుత పరిణామాలకు అన్వయించుకుంటే... ముందుగా చైనా దాడి చేస్తేనే మనం ప్రతిదాడికి పాల్పడగలం. అయితే ఈ ప్రతిదాడులు జల, వాయు, భూతల మార్గాల్లో ఏదైనా కావచ్చు. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో భారత్ రెండు వైపుల నుంచి యుద్ధం చేసే పరిస్థితి లేదు. అగ్ని-5 ద్వారా భూతలంపై నుంచి చైనాపై అణుదాడి చేయవచ్చు కానీ.. ఈ క్షిపణి ఇంకా రక్షణ దళాల సేవకు సిద్ధంగా లేదు. సముద్రమార్గం గుండా దాడి చేసేందుకు భారత్ సొంతంగా తయారు చేసుకున్న ఐఎన్ఎస్ అరిహంత్‌పై ఆధారపడాల్సి ఉంటుంది. దీనికి సాయంగా పనిచేసే ఐఎన్ఎస్ అరిఘాత్‌ను కే-4 జలాంతర్గాములను ఉపయోగించి చైనాకు 3,500 కిలోమీటర్ల దూరం నుంచి ఢీకొట్టాలి. కానీ కే-4ల నిర్మాణం ఇంకా పూర్తి కాలేదు. ప్రతిదాడులు చేసే సన్నద్ధత కరువైన నేపథ్యంలో భారత్ తన 'నో ఫస్ట్ యూజ్ పాలసీ'లో మార్పులు చేసుకోవాలని కొందరు రక్షణ రంగ విశ్లేషకులు భావిస్తున్నారని మాజీ జాతీయ భద్రతా సలహాదారు శివశంకర్ మీనన్ కొన్నేళ్ల క్రితం రాసిన పుస్తకంలో పేర్కొన్నారు. అణ్వాస్త్రాల నిరోధానికి కాకుండా యుద్ధాన్ని గెలిచే ఆయుధాలుగా భారత్ పరిగణించాల్సిన సమయం ఇదేనని, తద్వారా సంప్రదాయ యుద్ధరీతుల్లో చైనా కంటే తక్కువ అన్న న్యూనతాభావాన్ని పూరించుకోవచ్చునన్నది వీరి విశ్లేషణ. అణ్వాయుధ దేశాలు యుద్ధానికి దిగే పరిస్థితి లేదని అనుకుంటే భారత్, చైనా మధ్య యుద్ధం జరగనే జరగదు. ఒకవేళ జరిగితే సరిహద్దుల వద్ద పరిమిత స్థాయిలోనే ఉంటుంది. కానీ ఈ అంచనాపై సరైన విశ్లేషణ జరగలేదు.

**ఎవరి శక్తి ఎంత?**

భారత్ విషయాన్ని విశ్లేషించే ముందు ప్రపంచంలోని అణ్వాయుధ దేశాల పరిస్థితి ఒక్కసారి తెలుసుకుందాం. 1950లలో సంప్రదాయ యుద్ధంలో అమెరికా మిలటరీపై సోవియట్ యూనియన్‌దే పైచేయిగా ఉండేది. సాంకేతిక పరిజ్ఞానం విషయంలో కొంచెం వెనుకబడే ఉన్నప్పటికీ వాసి కంటే రాశి మేలన్న అంచనాతో సోవియట్ యూనియన్ ఉండేది. నాటి అమెరికా అధ్యక్షుడు డ్వైట్ ఐసెన్ హోవర్ సోవియట్ యూనియన్‌తో ట్యాంకులు, గన్నుల విషయంలో పోటీపడలేదు. బదులుగా వ్యూహాత్మక అణ్వాయుధాలతో యూరప్‌లో సోవియట్ యూనియన్‌కు చెక్ పెట్టగలిగారు. శక్తిమంతమైన అణ్వాయుధాలు ఉండటంతో అమెరికా మాట చెల్లుబాటైంది కూడా. సోవియట్ యూనియన్ అణ్వాయుధ ప్రతిదాడికి పాల్పడితే భారీ అణ్వాస్త్రాలతో దానిపై దాడి చేయాలన్న 'న్యూలుక్' వ్యూహంతో అమెరికా వ్యవహరించింది. 1970లకు వచ్చేసరికి సోవియట్ యూనియన్ సాంకేతిక పరిజ్ఞానాలు, వ్యూహాత్మక అణ్వాయుధాల విషయంలో అమెరికాకు సమానంగా ఎదిగింది. దీంతో అమెరికా అణ్వాయుధాలు, సంప్రదాయ క్షిపణుల మేళవింపుతో శత్రువుకు చెక్ పెట్టాలన్న 'సెకెండ్ ఆఫ్‌సెట్' పాలసీని ఆచరణలో పెట్టింది. కానీ ఇటీవలి కాలంలో చైనా కూడా తనదైన రీతిలో అమెరికాతో ప్రచ్ఛన్న యుద్ధం చేస్తోంది. తైవాన్ జలసంధి, దక్షిణ చైనా సముద్రాల్లో ఇరుపక్షాలు నిత్యం మోహరించి ఉండటం ఇందుకు ఉదాహరణ. ఈ రెండు ప్రాంతాల్లోనూ నౌకల సురక్షిత ప్రయాణానికి గస్తీ కాస్తున్న అమెరికా ఏ క్షణంలో చైనా గీసిన గీతను దాటుతావో అన్న ఆందోళనతో పనిచేస్తోంది. సంప్రదాయ యుద్ధంలో చైనాను ఢీకొట్టి గెలవడంపై అమెరికాకూ కొన్ని సందేహాలు ఉన్నాయి.

**హద్దుల నిర్ణయానికి సంప్రదింపులు...**

బైడెన్ అధికారం చేపట్టిన నాటి నుంచి అమెరికా చైనాతో సంప్రదింపులు జరిపేందుకు ప్రయత్నాలు చేస్తూనే ఉంది. చైనా సెంట్రల్ మిలిటరీ కమిషన్ సీనియర్ వైస్ ఛైర్మన్ జనరల్ షూ కిలియాంగ్‌ను కలిసి ఎవరి పరిధి ఎంతవరకో నిర్ణయించుకునేందుకు అమెరికా రక్షణ మంత్రి లాయిడ్ ఆస్టిన్ ప్రయత్నిస్తున్నారు. అయితే ఈ సమావేశానికి చైనా ససేమిరా అంటోంది. తైవాన్, దక్షిణ చైనా సముద్రాల్లో ఈ అసందిగ్ధ పరిస్థితులు కొనసాగితే ఆసియన్ దేశాలకూ ముప్పే. అందుకే ఈ దేశాలు కొంచెం వెనక్కు తగ్గాల్సిందిగా అమెరికా మిలటరీకి విజ్ఞప్తి చేశాయి కూడా.

**అమెరికా పరిస్థితి ఇలా ఉంటే...**

అమెరికా వద్ద ఉన్న భారీ అణ్వాయుధ సంపత్తి, ముందస్తు వాడకానికి వెనుకాడని అమెరికా వైఖరిపై చైనా ఆందోళన చెందుతోంది. ఈ కారణంగానే అణ్వాయుధాల తగ్గింపునకు అమెరికా, రష్యా చేసుకున్న ఒప్పందం 'స్టార్ట్'లో భాగస్వామి అయ్యేందుకు చైనా నిరాకరిస్తోంది. తమ అణ్వాయుధాలు తక్కువే కాకుండా చిన్నవని చెబుతూనే చైనా ముందస్తు అణ్వాయుధ ప్రయోగమన్న విధానాన్ని మార్చుకోనందుకా తటపటాయిస్తోంది. ఫలితంగా మరిన్ని వ్యూహాత్మక ఆయుధాలను సముపార్జించుకోవడంతోపాటు అణ్వాయుధ నిరోధ విధానాన్ని అడ్డుగా పెట్టుకుని అమెరికా దుందుడుకు చర్యలకు పాల్పడకుండా నియంత్రించాలని చైనా భావిస్తోంది. ఈ నేపథ్యంలో భారత్ కూడా 'నో ఫస్ట్ యూజ్' పాలసీని వదిలేయాలన్న ఆలోచనకు బలం చేకూరుతోంది. కానీ మనం ముందుగా అణ్వాయుధాలను ప్రయోగించే అవకాశమూ ఉండదు. హెచ్చరించడం కోసమైనా చైనా తన ఆయుధసంపత్తిని వాడటం మొదలుపెడితే అది మనకు ఆత్మహత్యా సదృశ్యమవుతుంది. అలాగని పరిమిత స్థాయిలో సంప్రదాయ యుద్ధంలోనూ మనం చైనాను ఢీకొట్టే పరిస్థితి లేదు.

**సశేష ప్రశ్నలు బోలెడు...**

చైనాతో అటు సంప్రదాయ రీతుల్లో, ఇటు అణ్వాయుధాలతో సరితూగని ప్రస్తుత పరిస్థితుల్లో ఆ దేశాన్ని ఎదుర్కొనే విషయంలో ఎన్నో ప్రశ్నలు సశేషంగానే మిగిలి ఉన్నాయి. అణ్వాయుధాలను యుద్ధ నివారణకు పావుగా వాడటం ఎలా? భారత అణు విధానం ఎలా ఉండాలి? అణ్వాయుధ నిరోధ విధానం విఫలమైన నేపథ్యంలో అగ్ని%--%5, అణ్వాయుధ క్షిపణులతో కూడిన జలాంతర్గాముల పాత్ర ఏమిటి? సంప్రదాయ రీతుల్లోనూ పీఎల్ఏ ఎత్తులకు పై ఎత్తులు వేయడం ఎలా? పీఎల్ఏ తరహాలో భారత మిలటరీలో సంస్కరణలు చేపట్టడం ఎలా? ఈ ప్రశ్నలకు సమాధానాలు వెతకడంలో ఆలస్యం జరిగేందుకు వీల్లేదు. లద్దాఖ్, అరుణాచల్ ప్రదేశ్‌లలో ఆక్రమించుకున్న భూభాగాలను సుస్థిరం చేసుకునేందుకు చైనా ప్రయత్నించే అవకాశం లేకపోలేదు. ఇంకోవైపు పాకిస్తాన్ మనకంటే ఎక్కువ అణ్వాయుధాలను కలిగి ఉన్నట్లు వస్తున్న సమాచారం ఏమంత మంచిది కాదు. జమ్మూ కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370 రద్దు తరువాత చైనా, పాక్ మధ్య మిలటరీ పరమైన బంధం దృఢమైంది. ఒకవేళ భారత్ చైనాల మధ్య యుద్ధమంటూ వస్తే... పాకిస్తాన్ అనుకోని అతిథిలా రంగంలోకి దిగినా ఆశ్చర్యం లేదు. ఉత్తర దిక్కునే కాదు.. పశ్చిమంలోనూ భారత్ పరిస్థితి కష్టతరమవుతోందనేది సత్యం. ఇది భారత్ మేల్కొనాల్సిన సమయం.

# డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమానికి విశేష స్పందన

ఒంగోలు సెప్టెంబరు 06, ప్రజాపాలన ప్రతినిధి: డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాని కి విశేష స్పందన లభించింది. ప్రకాశం భవనంలో ని స్పందన సమావేశ మందిరం లో జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్ సోమవారం డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి ఒంగోలు రాలేని ప్రజలు పదముడు మంది ఫోన్ ద్వారా నే తమ సమస్యలను కలెక్టర్ కు విన్నవించుకున్నారు. న్యాయం చేయాలని అభ్యర్థించారు. ల్యాండింగ్ లో సర్వే నెంబర్ 525 లోని 4.4 ఎకరాల మెట్ట భూమి ని మాగాణి గా నమోదు చేశారని, భూమిని మార్పు చేయాలని కంభం మండలం రావిపాడు గ్రామానికి చెందిన చిన్న వెంకటసుబ్బయ్య కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. చిన్నగంజాం మండలం పెదగంజాం లో ఉపాధి హామీ పథకం కింద మొక్కలు నాటడానికి అనుమతులు ఇవ్వాలని ఆ గ్రామాని కి చెందిన ఎం. ప్రసాద్ కలెక్టర్ కు విన్నవించారు. యద్దనపూడి మండలంలో ని పాఠశాలలో ఇంకుడు గుంతలు తీశాము. ఆ పనులకు సంబంధించిన బిల్లుల పై సర్పంచ్ సంతకం చేయడం లేదని ఆ గ్రామానికి చెందిన శాంతారావు కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. నిధులు వచ్చినప్పటికీ బిల్లులు చెల్లించడం లేదని, న్యాయం చేయాలని ఆయన అభ్యర్థించారు. ఇంటి స్థలానికి చేసుకున్న దరఖాస్తు పరిశీలించకుండానే తిరస్కరించారని పర్చూరు మండలం పోతవరం గ్రామానికి చెందిన అనిల్ కుమార్ కలెక్టర్ ఫిర్యాదు చేశారు. స్థలం ఇప్పించాలని ఆయన కోరారు. ఒంగోలు మండలం కబాడీ పాలెం లో అర్ధరాత్రి వేళ తాగునీరు సరఫరా చేయడంతో చాలా ఇబ్బందులకు గురవుతున్నామని జె.స్వరూప్ కుమార్ కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. రాత్రి వేళల్లో నీళ్ల కోసం పడిగాపులు కాస్తుంటే కేవలం 10 నుంచి15 నిమిషాలు విడుదలవుతున్నాయని చెప్పారు. చిన్న చిన్న ఉద్యోగులు, పనులు చేసుకోవడానికి బయటకు వెళ్లే వారంతా రాత్రి పూట నిద్ర లేక ఇబ్బందులు పడుతున్నామని ఆయనకు వివరించారు. న్యాయం చేయాలని కోరారు. కేంద్రీయ విద్యాలయం లో నా కుమారుడు విద్యనభ్యసిస్తుండగా, రికార్డుల్లో ఇంటి పేరు సరిచేయాలని పలుమార్లు అభ్యర్థించినప్పటికీ రెగ్యులర్ ప్రిన్సిపాల్ లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని టంగుటూరు మండలానికి చెందిన టి.వెంకట్రావు కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. భవిష్యత్తు లో ఎలాంటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమం లో జిల్లా సంయుక్త కలెక్టర్లు జె. వెంకటమురళి, టి.ఎస్. చేతన్, కె.ఎన్.విశ్వనాథన్, కె.కృష్ణవేణి, డి ఆర్ ఓ డి.తిప్పేనాయక్, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





## డిఎస్పీని సత్కరించిన.. వాయిస్ ఆఫ్ ముస్లీం మైనారిటీ సేవాసంస్థ

కావలిసెప్టెంబరు 06, ప్రజాపాలన ప్రతినిధి: వాయిస్ ఆఫ్ ముస్లిమ్ మైనార్టీస్ సేవాసంస్థ, పట్టణంలోని జామియా మసీదు సభ్యులు, పలువురు ముస్లిమ్ సోదరులు కలసి డీఎస్పీ ప్రసాద్ అడిషనల్ యస్పీ గా పదోన్నతి పొందిన సందర్భంగా సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వాయిస్ ఆఫ్ ముస్లిమ్స్ సంస్థ అధ్యక్షుడు మొగల్ సలీమ్ బేగ్,జనాబ్ షాహుల్ హమీద్ మాట్లాడుతూ డీఎస్పీ అందించిన సేవలు ప్రజల మన్ననలు పొందారని అన్నారు. కరోన కట్టడి చేయడంలో ప్రధాన పాత్ర వహించారని అన్నారు. డిఎస్పీ ప్రసాద్ మాట్లాడుతూ కావలి డివిజన్ లో శాంతి భద్రత లు కాపాడటానికి ముస్లిం సోదరుల సహకారం అభినందనీయం అని అన్నారు. తనతో మంచి అనుబంధం కొనసాగించారని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు షేక్ ఖాదర్ బాషా ,జామియా మసీద్ ప్రెసిడెంట్ రియాజ్ ,రషీద్ ,సమీ ,కజాజీ సైదే మౌల్వీ ,మన్సూర్ ,కరీముల్లా ,ఫయాజ్ ,మస్తాన్ బాషా ,దస్తగిరి ,సిద్దిక్ ,అబ్దుల్ అలీం ,అమీర్ జాన్ ,పర్వీన్ జానీ ,సిరాజ్ ,జిలాని ,నాగుర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రొబేషన్ డిక్లరేషన్ కోసం పరీక్షను రద్దు చేయాలని డిమాండ్



కారంపూడి, సెప్టెంబరు 06, ప్రజాపాలన ప్రతినిధి: మండలం లో ఎంపీడీవో బి బాలు నాయక్ కు విద్య, సంక్షేమ సహాయకులు ప్రొబేషన్ డిక్లరేషన్ కోసం ప్రభుత్వం పరీక్షను రద్దు చేయాలని కోరుతూ వినతిపత్రం అందించారు ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకోని వెళతానని తెలిపారు ఈ కార్యక్రమంలో విద్య, మండలంలోని అన్ని గ్రామ సచివాలయలలో విధులు నిర్వహించే విద్య, సంక్షేమ సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బీసీ సంక్షేమంకు మద్దతు తెలిపిన.. తెదేపా నాయకులు



నెల్లూరు సెప్టెంబరు 06, ప్రజాపాలన ప్రతినిధి: 2021 లో కేంద్ర ప్రభుత్వం యొక్క ఆధ్వర్యం లో జరగబోతున్న జనగణనలో బీసీ ల జనగణన జరగాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ ఎదుట దీక్ష చేస్తున్న ఆంధ్ర రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం కు నెల్లూరు జిల్లా టీడీపీ నేతలు పోలిట్బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, నెల్లూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్, నగర నియోజకవర్గ ఇంఛార్జి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, గూడూరు నియోజవర్గ ఇంఛార్జి పాసిం సునీల్ కుమార్, మాజీ శాసన సభ్యులు చెంచల్ బాబు యాదవ్, మాజీ మున్సిపల్ చైర్మన్ తాళ్ళపాక అనురాధ మద్దతు తెలిపారు. నెల్లూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూగతంలో మన దేశ ప్రధాని నరేంద్ర మోడీ గారు ఈ యొక్క జనగణన లో బీసీ లు ఎంత మంది ఉన్నారో లెక్కించి బీసీ లకు తగు న్యాయం చేస్తానని చెప్పిన విషయం గుర్తు చేశారు.. కేంద్ర ప్రభుత్వం వారు ఇచ్చిన హామీని పట్టించుకోలేదని, బీసీ ల జనగణన ఊసు ఎత్తలేదని అన్నారు.. బీసీ లలో ఎన్ని కులాలు ఉన్నాయి, ఎంత మంది ఉన్నారు, ఏయే వృత్తులు చేస్తున్నారో తెలిస్తే వారికి సంక్షేమం అందచేయొచ్చు అన్నారు. జనగణన చేయకుండా, గుడ్డిగా ఒకసారి 50 శాతం అంటారని, ఇంకో సారి 56 శాతం అంటారని, అసలు జనగణన చేసి బీసీ ల పూర్తి శాతం తెలియపరచాల్సిన అవసరం ఉందని అన్నారు..వారు ఏయే వృత్తులు చేస్తున్నారు, దానికి సంబంధించి సమగ్రమైన కనీస వసతులు ఉన్నాయా లేదా చూసి, వారికి వసతులు కల్పించాలని అన్నారు...ప్రపంచం లో ఏం కావాలన్న తెలుసుకునే స్థాయి కి భారత దేశం ఎదిగినా, బీసీల జనగణన చేయలేని పరిస్థితిలో ఈ రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు ఉండడం బాధాకరం అని అన్నారు.బీసీ లు చేసే ఈ పోరాటానికి తెలుగుదేశం పార్టీ పూర్తి మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటించారు..

## బాషా పై జరిగిన దాడిని ఖండిస్తూ ఫొటోగ్రాఫర్ల నిరసన




ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 06, ప్రజాపాలన ప్రతినిధి: అనంతపురంలోని ఎస్ఆర్ గ్రాండ్ ఫంక్షన్ హాల్ లో ఫొటోగ్రాఫర్ బాషాపై జరిగిన దాడిని ఖండిస్తూ ఇబ్రహీంపట్నం మండలంలోని ఫొటోగ్రాఫర్లు సోమవారం స్టూడియోలు బంద్ చేశారు. ఇబ్రహీంపట్నం ది యువత ఫొటోగ్రాఫర్స్ అండ్ వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి రింగ్ సెంటర్ లోని గాంధీ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ సూర్యారావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు నల్లమోతు రత్నకుమార్, కార్యదర్శి వి.ఎస్.రాంబాబు, ఉపాధ్యక్షుడు పాగోలు నాగరాజు, కమిటీ సభ్యులు బసవరాజు, రమేష్, నాగేశ్వరరావు, నాగరాజు, కృష్ణారావు, జ్యోతిరాజు, చిన్నా, నాగేశ్వరరావు, కాశీం, సురేష్, మూర్తి పాల్గొన్నారు.

## అన్నదానమునకు 10,116 దేవాలయానికి విరాళము

పెనుగంచిప్రోలు, సెప్టెంబర్6 (ప్రజాపాలనప్రతినిధి) : తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం పెనుగంచిప్రోలు అ మ్మవారి దేవాలయంలో జరుగు అన్నదానమునకు ఖమ్మం నెహ్రు నగర్ కు చెందిన బాలమిత్ర చిల్డ్రన్స్ హాస్పిటల్ వారు ఏలూరు వెంకటేశ్వరరావు దంపతు లు 10116 రూపాయలు దేవాలయ అధికారులకు విరాళము గా అందించినారు వీరిని దేవాలయ అ ర్చకులు వేద పండితులు ఆశీర్వదించి అమ్మవారి ప్రసాదములు అందించినారు.



## రాజుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో" ఆశా డే' కార్యక్రమం



రాజుపాలెం, సెప్టెంబరు 06, ప్రజాపాలన ప్రతినిధి: డాక్టర్ కృష్ణ కుమార్ పర్యవేక్షణ లో జరిగింది. డాక్టర్ గారు మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలి అని తెలియచేసినారు. లింగనిర్ధారణ పై పరీక్షలు పై కూడా అవగాహన కల్పిచినారు. రేపు అన్ని సచివాలయల లో కోవిడ్ వాక్సినేషన్ జరుగుతుందని తెలియచేసినారు అనంతరం 33 మంది ఆశా కార్యకర్తలకు ప్రభుత్వం అందచేసిన మొబైల్ లు అందచేసినారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వెంకయ్య,కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు,పర్యవేక్షకులు జీవనరావు, గాంధీ, ఉదయాలక్ష్మి, మరియు ఆరోగ్య సిబ్బంది పాల్గున్నారు.

## నరసరావుపేట పార్లమెంట్ తెలుగు యువత అధికార ప్రతినిధిగా మొహ్మద్ రఫీ



నరసరావుపేట, సెప్టెంబరు 06, ప్రజాపాలన ప్రతినిధి: నరసరావుపేట పట్టణానికి చెందిన టీడీపీ మైనార్టీ నాయకులు మొహ్మద్ రఫీ నరసరావుపేట పార్లమెంట్ తెలుగు యువత అధికార ప్రతినిధిగా నియమితులయ్యారు. తన నియామకానికి సహకరించిన వారికి సోమవారం రఫీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రఫీ మాట్లాడుతూ నరసరావుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్–చార్జ్ డా.చదలవాడ అరవింద బాబు తన పై నమ్మకం ఉంచి ఈ పదవిలో నియమించారని అన్నారు. నరసరావుపేట పార్లమెంట్ పరిధిలో గల యువత సమస్యల పై పని చేస్తానని అన్నారు. ఈ పదవిలో నియమించిన డా.చదలవాడకు కృతజ్ఞతలు తెలిపారు.

## గర్భిణీ స్త్రీల కు, చిన్న పిల్లలకు హెల్త్ క్యాంపు



పెనుగంచిప్రోలు, సెప్టెంబరు 06, ప్రజాపాలన ప్రతినిధి: అనిగండ్లపాడు గ్రామంలో పౌష్టికాహార మాసోత్సవంలో భాగంగా గర్భిణీ స్త్రీలకు, చిన్న పిల్లలకు హెల్త్ క్యాంపు నిర్వహించిన అంగన్వాడీ టీచర్స్, అనిగండ్లపాడు గ్రామంలోని సచివాలయ ఏఎన్ఎం తో గర్భిణీ స్త్రీల కు, చిన్న పిల్లలకు హెల్త్ క్యాంపు నిర్వహించి, వారికి తగు సూచనలు ఇచ్చారు, ఈ కార్యక్రమంలో అంగ న్వాడీ టీచర్స్, గర్భిణి స్త్రీలు,పిల్లలు,ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## చవితి ఉత్సవాలపై ముఖ్యమంత్రి దృష్టికి ఎమ్మెల్యే గ్రంధి



భీమవరం, సెప్టెంబర్ 6 (ప్రజాపాలన ప్రతినిధి) : వినాయక చవితిని పురస్కరించుకొని జరిగే నవరాత్రి ఉత్సవాలను కరోనా నిబంధనలను అనుసరించి నిర్వహించుకునేలా ప్రభుత్వం అనుమతి ఇచ్చేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లాలని జిల్లా ఇన్చార్జి మంత్రి పేర్ని నాని ని భీమవరం శాసనసభ్యులు గ్రంధి శ్రీనివాస్ ఫోన్లో కోరారు. పట్టణానికి చెందిన కొంతమంది భక్తులు సోమవారం స్థానిక శాసనసభ్యుని కార్యాలయంలో శాసనసభ్యులు గ్రంధి శ్రీనివాస్ ను కలిసి ఎప్పటిలాగే వినాయక చవితి సందర్భంగా గణపతి నవరాత్రి ఉత్సవాలు నిర్వహించుకునే విధంగా ప్రభుత్వం అనుమతి ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన శాసనసభ్యులు జిల్లా ఇన్చార్జి మంత్రి పేర్ని నానితో ఫోన్లో మాట్లాడారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి అనుమతులు ఇచ్చేలా చూడాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి పేర్ని నాని ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి చవితి ఉత్సవాలకు అనుమతులు సాధించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## "మామిడి తోటల్లో మాయలు"

పెనుగంచిప్రోలుసెప్టెంబర్6(ప్రజాపాలనప్రతినిధి)పెనుగంచిప్రోలు గ్రామం శివారులోని మామిడి తోటల్లో అసాంఘిక కార్యకలా పాలు కేరాఫ్ అడ్రస్ మారుతున్నా యా శుక్రవారం. ఆదివారం మామిడి తోటల్లో ఏమి జరుగుతుంది. ప్రతిరోజు రాత్రి సమయంలో మామిడి తోట లో ఏమి ఏమి జరుగుతున్నాయి?వారికి ఏ స మయం వరకు పర్మిషన్ లు?అసలు మామిడి తోట లై నిఘా ఎంత?కొంతమంది రాజకీయ నాయకుల అండ దండలతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నా మామిడి తోటల యజమానులు.సంబంధిత అధికారులు ఎక్క డ?అసలు ఏమి జరుగుతుందని ప్రజలలో ఇలాంటి ఎన్నో రకమైన ఆలోచనలు కలుగుతున్నాయి, అదేవి ధంగా ఆంధ్ర ప్రదేశ్ గౌరవ ముఖ్యమంత్రి జగన్ మో హన్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన మద్య పాన నిషేదాని నీరు కారుస్తూ, అధికారుల కళ్లుగప్పి తెలంగాణ మద్యాన్ని అక్రమంగా తీసుకొచ్చి, ఈ మా మిడి తోటల్లో విక్రయిస్తున్నట్లు ప్రజలలో వినికిడి,మరి అధికారులు ఇప్పటికైనా పెనుగంచిప్రోలు గ్రామ శివా రు మామిడి తోటలపై అధికారులు నిఘా పెట్టి వారి ఆటలు కట్టిస్తారు అని ప్రజలు కోరుకుంటున్నారు.



## భారతీయ జనతాపార్టీ ఆధ్వర్యంలో నిరసన

నరసరావుపేట,సెప్టెంబరు 06, ప్రజాపాలన ప్రతినిధి: భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు పిలుపు మేరకు రాష్ట్రంలో వినాయక చవితి ఉత్సవాలు జరుపుకోవటానికి అనుమతించాలని కోరుతూ నర్సరావుపేట సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం నిరసన తెలియజేసి మెమొరాండం అందజే జేశారు ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కర్ణ అమర సైదారావు, పట్టణ అధ్యక్షుడు రంగి శెట్టి రామకృష్ణ, రాష్ట్ర, జిల్లా ,పట్టణ భారతీయ జనతా పార్టీ నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.



## ట్రై సైకిల్స్ పంపిణీ చేయండి: డా.చదలవాడ అరవింద బాబు



నరసరావుపేట, సెప్టెంబరు 06, ప్రజాపాలన ప్రతినిధి: నరసరావుపేట మండలంలోని లింగంగుంట్ల లోగల ఒక గౌడోన్లో ఉన్నా ట్రై సైకిల్స్ సోమవారం నరసరావుపేట నియోజకవర్గ టిడిపి ఇన్–చార్జ్ డా.చదలవాడ అరవింద బాబు సందర్శించారు. గౌడోన్ లో పాడైపోయిన 1500 ట్రై సైకిళ్ళను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎనిమిది నెలల క్రితం కేంద్ర ప్రభుత్వం ఎంపి నిధుల నుండి దివ్యాంగుల కొరకు 30 లక్షల రూపాయలు మంజూరు చేసిందని అన్నారు. నిరు పేదలైన దివ్యాంగుల కొరకు కేంద్రం బాసటగా నిలించిందని అన్నారు. ఎంపి నిధులతో కొనుగోలు చేసిన ట్రై సైకిళ్ళను వారికి పంపిణీ చేయకుండా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. అధికార పార్టీ నాయకులు ఒత్తిడికి తలొగ్గి దివ్యాంగులకు పంపిణీ చేయకుండా ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. తక్షణమే వారికి ట్రై సైకిళ్ళను మరమ్మత్తులు చేసి పంపిణీ చేయాలని నరసరావుపేట ఆర్డఓ శేషిరెడ్డికి తెలుగుదేశం పార్టీ నాయకులు వినతి పత్రం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు వెన్న బలకోటి రెడ్డి, కొల్లి బ్రహ్మయ్య,మన్నన్ షరీఫ్, బడే బాబు,కుమ్మేత కోటి రెడ్డి,యాడ్స్ వాలి, మెడబలిమి నవీన్,సైదవాలి,నాగుర్,చల్లగుండ్ల హరికృష్ణ,కరిముల్లా,మబు,బంగారం, ఖాలీల్,బాషా తదితరులు ఉన్నారు.



## ఎన్టీఆర్ కూడలి వద్ద ధర్నా



జగ్గయ్యపేట, సెప్టెంబరు 06, ప్రజాపాలన ప్రతినిధి: జగ్గయ్యపేట భారతీయ జనతా పార్టీ పట్టణ అధ్యక్షులు గోలి రాఘవేంద్ర రావు ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవాల మీద రాష్ట్ర ప్రభుత్వం విధించిన ఆం క్షలను వెంటనే ఉపసంహరించుకోవాలని వెంటనే మండపం నిర్వాహకులకు అనుమతి ఇవ్వాలని పట్ట ణంలో ఎన్టీఆర్ కూడలి వద్ద వర్షాన్ని సైతం లెక్కచే యకుండా ధర్నా కార్యక్రమం నిర్వహించి నిరసన ర్యా లీ నిర్వహించుకుంటూ తాసిల్దార్ కి మరియు మున్సి పల్ కమిషనర్ కి వినతి పత్రం సమర్పిం చటం జరిగిం ది,ఈ కార్యక్రమంలో విజయవాడ పార్ల మెంట్ జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రంలో హిందువుల మనోభావాలను జగన్ ప్రభుత్వం వచ్చి న దగ్గరనుంచి దెబ్బ తింటూనే ఉన్నాయని ప్రభుత్వా నికి హిందూ పండుగలు అప్పుడే కరోనా కని పిస్తుం దా అని ప్రశ్నించారు,ఈ కార్యక్రమంలో పట్టణ అధ్య క్షులు రాఘవ, పట్టణ ప్రధాన కార్యదర్శి మురళి, పట్ట ణ యువమోర్చా అధ్యక్షులు యపొంగు రాజా %బా.ు% మోర్చ యర్రబడి అశోక్, కొప్పు సత్యం, మేడూరి వెం కటేశ్వరరావు, జగ్గయ్యపేట మండల అధ్యక్షుడు కిషో ర్ బాబు దేవా హిందూ సంఘాలు పాల్గొని మ ద్ద తు తెలియజేశారు.

## వీడియో గ్రాఫర్లు స్టూడియోల బంద్ కు పిలుపు



జగ్గయ్యపేట, సెప్టెంబరు 06, ప్రజాపాలన ప్రతినిధి: అనంతపురంలో ఫోటోగ్రాఫర్ భాషా పై ఒక హెూటల్ యాజ మాన్యం జరిపిన దాడిని ఖండిస్తూ జగ్గయ్యపేట ఫో టోగ్రాఫర్లు ఎన్టీఆర్ సర్కిల్ వద్ద నిరసన కార్యక్రమం ని ర్వహించారు...ఫోటోగ్రాఫర్ పైన జరిగిన దాడిని ఖం డిస్తూ ఈ రోజు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఫోటో %డ% వీడియో గ్రాఫర్లు స్టూడియోల బంద్ కు పిలుపుని చ్చాయి.ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన ఫోటో %డ% వీడియోగ్రాఫర్లు గా ఏర్పడి ఈ బంద్ కు పిలుపు నిచ్చాయి....రాష్ట్ర వ్యాప్తంగా బంద్ కు పిలుపు నిచ్చి న నేపథ్యంలో జగ్గయ్యపేట ఫోటో %డ% వీడియో గ్రాఫర్, ఫోటో స్టూడియోలు, మిక్సింగ్ యూనిట్ లు, ఆల్బం డిజైన్ సెంటర్ లు, కలర్ ల్యాబ్స్, ఫోటో మేటిరియల్ స్టోర్స్, ఫోటో ఫ్రేమ్ వర్క్స్, అనుబంధంగా ఉన్న అన్ని శాఖల వ్యాపార సముదాయాలు, మూసి వేసి (బంద్ నిర్వహించి) దాడిని ఖండిస్తూ భాషాకు అండగా నిల వాలని ది జగ్గయ్యపేట ఫోటో వీడియో గ్రాఫర్ల అసో సియేషన్ వారు కోరారు,ఎస్.ఆర్ కళ్యాణ మండపం వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, బేషరతుగా బాషాకు క్షమాపణ చెప్పించాలని డిమాండ్ చేశారు.

## ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి కి కృతజ్ఞతలు తెలిపిన డైరెక్టర్ చింతా కిరణ్ కుమార్



నరసరావుపేట, సెప్టెంబరు 06, ప్రజాపాలన ప్రతినిధి: ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర గ్రీనింగ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ గా నియమితులైన సందర్భంగా వైఎస్సార్సీపీ కార్యాలయం నందు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి ని కలిసి కృతజ్ఞతలు తెలిపిన చింత కిరణ్ కుమార్ , ఈ కార్యక్రమంలో కిరణ్ తో పాటు మోరబోయిన శ్రీనువాసరావు , మోరే రవీంద్రారెడ్డి , అంజనారెడ్డి ,యన్నం రవీంద్రా రెడ్డి ,తదితరులు పాల్గొన్నారు.

## ద్వారాకాతిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామివారి దేవస్థానం



ఏలూరు, సెప్టెంబరు 06, ప్రజాపాలన ప్రతినిధి: పశ్చిమగోదావరిజిల్లా ద్వారాకాతిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామివారి దేవస్థానం హుండీలు లెక్కింపు సోమవారం జరిగింది.19 రోజులకు 2కోట్ల35లక్షల 98వేల803 రూపాయలు నగదు.848గ్రాముల బంగారం.8కేజీల5గ్రాముల వెండి.1000రూపాయల పాట నోట్లు34 వచ్చాయని 500 నోట్లు 44 ఇవికాక పలుదేశాలకరెన్సీ నోట్లు వచ్చినట్టు ఈ ఓ జి వి సుబ్బారెడ్డి తెలిపారు.....

# గణేష్ ఉత్సవాలకు ప్రభుత్వం అనుమతి ఇవ్వాల్సిందే

## విశ్వ హిందూ పరిషత్ డిమాండ్

## భీమవరంలో నిరసన ప్రదర్శన

## గణనాధునికి వినతిపత్రం




భీమవరం, సెప్టెంబరు 06, ప్రజాపాలన ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వినాయక చవితి ఉత్సవాలకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు ఇవ్వాల్సిందేనని విశ్వహిందూ పరిషత్ డిమాండ్ చేసింది. గణేష్ మండపాలకు ప్రభుత్వం కోవిడ్ నిబంధనలు తప్ప ఎటువంటి ఆంక్షలు విధించకూడదని, వెంటనే అనుమతులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ విశ్వహిందూ పరిషత్ పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో సోమవారం పెద్దఎత్తున నిరసన, ధర్నా కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని ప్రసిద్ధ గణేష్ ఆలయానికి ఊరేగింపుగా వెళ్లి గణపతి స్వామివారికి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి, అధికారులకు, పోలీసులకు హిందువుల పట్ల వివక్ష లేకుండా అందరితో సమానంగా చూడగల సద్బుద్ధిని ప్రసాదించమని వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ ప్రాంత కార్యదక్షులు ఒబిలిశెట్టి శ్రీ వెంకటేశ్వర్లు, ప్రాంత విశేషసంపర్క ప్రముఖ ఉద్దరాజు వేణుగోపాల్ రాజు మాట్లాడుతూ వినాయక చవితి మండపాలు వేస్తే పోలీసులు తీసుకెళ్లి బొక్కలో వేస్తామని హెచ్చరిస్తున్నారని అటువంటి జీవో కాపీ ఎక్కడా లేదని స్పష్టం చేశారు. క్రైస్తవుల పండుగలు మహమ్మదీయుల పండుగలు యధావిధిగా జరుగుతున్నాయని అదేవిధంగా రాజకీయ నాయకులు వర్ధంతులు, జయంతులు, ఆడంబరాలు జరుగుతున్నాయని వారు మండిపడ్డారు.ఆర్టీసీ బస్సులో ప్రయాణికులు నిలబడి ప్రయాణం చేస్తున్నారని వివరించారు. బ్రాందీషాపులు, బార్లు గురించి చెప్పాల్సిన అవసరంలేదని ఆటోలు కూడా రద్దీతో ప్రయాణం చేస్తున్నాయని అన్ని యదావిధిగానే జరుగుతున్నాయని కేవలం హిందువుల పండగలకు వచ్చేసరికి వివక్ష చూపుతున్నారని ఎద్దేవాచేశారు. హిందూదేశంలో ఉన్నామని హిందువుల పండుగలు అడ్డుకోవడం సరి కాదని మహమ్మదీయుల పండుగలు, క్రైస్తవుల పండుగలకు చర్చిస్తున్నారని మరి హిందువుల పండుగ ఎందుకు చర్చించడం లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సాధువులను, స్వామీజీలను, దార్మిక సంఘాల పెద్దలను పిలిచి మీరు ఎందుకు చర్చించడం లేదని వారు ప్రశ్నించారు. ఇప్పటికే 250 హిందూ దేవాలయంపై దాడులుజరిగితే మీరు ఎందుకు పట్టించుకోవడంలేదని అదేవిధంగా అంతర్వేది లో రథం దగ్ధం ఘటన జరిగి ఏడాది గడుస్తున్నా ఇప్పటివరకు ప్రభుత్వం ఎందుకు స్పందించలేదని దుయ్యబట్టారు. చర్చిమీద రాయి పడిందని హిందువులను వెంటనే అరెస్ట్ చేసి బెయిల్ రాకుండా చేశారన్నారు. రథం దగ్ధంచేయడం, రాముడు తల తీసేయడం వంటి సంఘటనలు హిందూ సమాజాన్ని తీవ్ర ఆగ్రహానికి గురి చేస్తున్నాయని తెలిపారు. మేము అందరం మీకు ఓట్లేస్తేనే మీరు గెలిచారని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఈవిషయం గుర్తుంచుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో కందాల వంశీకృష్ణ ,మజ్జి మహేష్ ,అల్లూరి సాయిదుర్గ రాజు, చెట్లపల్లి జగన్మోహన్, అరసవల్లి సుబ్రహ్మణ్యం, వీర రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

## వినాయక చవితి పండుగకు ప్రభుత్వం అనుమతించకపోతే ఆత్మహత్యలే శరణ్యం



కారంపూడి, సెప్టెంబరు 06, ప్రజాపాలన ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వినాయక చవితి పందిరి ఉత్సవాలకు అనుమతి ఇవ్వకపోతే తమకు ఆత్మహత్యలే శరణ్యమని విగ్రహాల తయారీ దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వినాయక ఉత్సవ విగ్రహాల తయారీదారులు కారంపూడి లో గత కొన్ని సంవత్సరాలుగా ఇందిరా గాంధీ బొమ్మ సెంటర్ లో సమీపంలోని వినాయక ఉత్సవ విగ్రహాలను పెద్దఎత్తున తయారుచేస్తున్నారు. రాజస్థాన్ రాష్ట్రం నుండి వీరు కొన్ని సంవత్సరాల క్రితం ఇక్కడకు వచ్చి ఇక్కడ స్థిర నివాసం ఏర్పాటుచేసుకున్నారు. దాదాపు 30 మంది వర్కర్స్ ఈ విగ్రహాల తయారీలో నిత్యం నిమగ్నమై వుంటారు. ఒక అడుగు నుండి 15 అడుగుల ఎత్తు వరకు విగ్రహాలను ఇక్కడ తయారుచేస్తున్నారు. కాగా రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది కూడా వినాయక చవితి బహిరంగ ఉత్సవాలకు అనుమతిని మంజూరు చేయకపోవడంతో ఇక్కడ పలు కుంటుంబాల వారు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వీరు సోమవారం ప్రజాపాలన దినపత్రిక ప్రతినిధి తో ప్రత్యేకంగా మాట్లాడుతూ తమ ఆవేదనను వెలిబుచ్చారు. దాదాపు 20 లక్షలు రూపాయలను వడ్డీలకు తెచ్చి ఈ విగ్రహాల తయారీపై పెట్టుబడులు పెట్టామన్నారు. కోవిడ్ కారణంగా గత ఏడాది కూడా ప్రభుత్వం వినాయక చవితి ఉత్సవాలకు అనుమతి ఇవ్వకపోవడంతో ఆర్థికంగా ఎంతో నష్టపోయామన్నారు. అయితే ప్రభుత్వం ఈ సంవత్సరం కూడా వినాయక చవితి ఉత్సవాలకు అనుమతి ఇవ్వకపోవడంతో ఏంచేయాలో పాలుపోవడం లేదన్నారు. వందల విగ్రహాలు ఇక్కడ తయారై వున్నాయన్నారు. ఇప్పటికే కరెంటు బిల్లులు, జీతాలు, అద్దెలు ఇతర ఖర్చులను ప్రతినెలా చెల్లిస్తూ నిండామునిగి పోయామన్నారు. ఇక ఇక్కడ తయారు చేసిన విగ్రహాలు ఈ ఏడాది కూడా అమ్ముడవకపోతే, పెట్టుబడులు రాక, భాకీలు తీర్చలేక తాము ఆత్మహత్యలే చేసుకోవాల్సిందేనని వారు తీవ్ర భయాంధోళనలు వ్యక్తం చేస్తున్నారు. తామేకాదు రాష్ట్రవ్యాప్తంగా తమలాగా విగ్రహాల తయారీదారుల అందరి పరిస్థితులు కూడా కడు దయనీయంగా ఉన్నాయన్నారు. పల్నాడు ప్రాంతం వారే కాకుండా, పలు గ్రామాలు నుండి కూడా వందలు మంది ఇక్కడకు వచ్చి విగ్రహాలను కొనుగోలు చేస్తుంటారని, వెయ్యి రూపాయల నుండి 30 వేలు ఖరీదు చేసే విగ్రహాలు ఇక్కడ లభిస్తున్నాయని వారు పేర్కొన్నారు.

## సమస్యలను వెంటనే పరిశీలిస్తాం: రూరల్ ఎస్పీ విశాల్ గున్ని




గుంటూరు, సెప్టెంబరు 06, ప్రజాపాలన ప్రతినిధి: రూరల్ జిల్లా పోలీస్ కార్యాలయములోని స్పందన కార్యక్రమములో పాల్గొని ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించిన లిరూరల్ ఎస్పీ శ్రీ విశాల్ గున్ని ఐపీఎస్ . సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామని ప్రజలకు భరోసా ఇచ్చిన ఎస్పీ . క్షేత్ర స్థాయిలో ఫిర్యాదుదారుల వద్దకే వెళ్లి సమస్యలను పరిష్కరించాలని పోలీస్ అధికారులకు ఎస్పీ ఆదేశాలు.ప్రజల నుండి ప్రతి రోజు స్వీకరించే ఫిర్యాదులకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని సేకరించి,భద్రపరచాలనీ ఆదేశాలు. తల్లిదండ్రులను మరియు వృద్ధులను ఇబ్బందులకు గురిచేసే వారిపై వయోవృద్ధుల చట్టం ప్రకారం కేసులు నమోదు చేసి,తగిన చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులకు ఎస్పీ ఆదేశాలు. చీటీ పాటల పేరుతో ప్రజలను మోసం చేసే వారిపై నిఘా ఉంచి,చట్టపరంగా కఠిన చర్యలు తీసుకివాలని ఎస్పీ తెలిపారు. ఆపద సమయాలలో మేమున్నాం అంటూ ప్రజలకు భరోసా కల్పించాలని ఎస్పీ అధికారులకు సూచించారు. అధిక వడ్డీలు ఆశచూపి



మోసం చేసే వారూ,తక్కువ మొత్తానికి ఆస్తులు విక్రయిస్తామని మాయ మాటలు చెప్పి మోసం చేసే వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు ఎస్పీ సూచించారు. ఎస్పీ ఆదేశాల మేరకు స్పందన కార్యక్రమానికి విచ్చేసిన ఫిర్యాదుదారులకు వెల్ఫేర్ ఆర్ఐ రమేష్ కృష్ణన్ భోజన సదుపాయాలు కల్పించారు. ఈ స్పందన కార్యక్రమంలో ఎస్పీ(%చీజ)చీయా% మూర్తి ,%ఇజ=దీ% డిఎస్పీ లక్ష్మయ్య ,స్పందన సీఐ శ్రీనివాసరావు ,ఎస్సై క్రాంతి కిరణ్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## మన్నవలో ఆశా వర్కర్లకు అవగాహన సదస్సు



పొన్నూరు, సెప్టెంబరు 06, ప్రజాపాలన ప్రతినిధి: మండల పరిధి మన్నవ గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం ఆశా వర్కర్లకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో వైద్య అధికారిణి కనపర్తి ఝాన్సీ రాణి పాల్గొని మాట్లాడుతూ నేడు జరిగే మెగా వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అలానే చిన్న పిల్లల ఆరోగ్య సమస్యలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలను ప్రభుత్వం నిషేధించిందని గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అలానే బిడ్డ, బిడ్డ మూడు నెలల వ్యవధి వచ్చేంతవరకు ఇరువురు తగు జాగ్రత్తలు పాటించి ఆరోగ్యవంతంగా ఉండేవిధంగా అవగాహన కల్పించాలన్నారు. అలా చేసిన వారికి ప్రభుత్వం ఇంజెక్షన్లు సౌకర్యం కల్పిస్తున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ అంశాలపై అవగాహన కల్పించారు.

## స్పందనలో సమస్యలతో వచ్చిన ఫిర్యాదుదారులు ఫిర్యాదును స్వీకరించిన ప్రకాశం జిల్లా ఎస్పీ




ఒంగోలు, సెప్టెంబరు 06, ప్రజాపాలన ప్రతినిధి: సమస్యల తో వచ్చిన ఫిర్యాదుదారులు నుండి ఫిర్యాదులను స్వీకరించి వారి సమస్యలకు చట్ట పరిధిలో పరిష్కారం చూపుతామని హామీ అందించిన ప్రకాశం జిల్లా ఎస్పీ మలిక గర్గ్, ప్రకాశం జిల్లా పోలీస్ స్పందనకు 144 ఫిర్యాదులు వచ్చాయి.జిల్లా పోలీసు కార్యాలయం లో కోవిడ్ నిబంధనలు అనుసరిస్తూ 'స్పందన' కార్యక్రమం నిర్వహించి జిల్లా వ్యాప్తంగా వివిధ సమస్యల తో వచ్చినవారి ఫిర్యాదులను స్వీకరించి క్షుణ్ణంగా పరిశీలించారు. మీ సమస్య ఏదైనా, మీకు ముందుగా పోలీసుశాఖ అండగా నిలబడుతూ, మీ సమస్యకు తగు విచారణ జరిపి, చట్ట పరిధి లో పరిష్కారం అందిస్తామని జిల్లా ఎస్పీ, పోలీసు కార్యాలయం లో నిర్వహించిన స్పందన కార్యక్రమం లో పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో ఎస్పీ జిల్లా నలుమూలల నుండి వచ్చిన ఫిర్యాదుదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొని, చట్ట ప్రకారం ఆ ఫిర్యాదుల పై తగు విచారణ జరిపి సత్వర న్యాయం అందించేలా కృషి చేస్తామని, పోలీస్ శాఖ ఎల్లవేళల తోడుగా ఉంటుందని హామీ ఇచ్చారు. వివిధ రకాలైన సమస్యలతో ఎస్పీ ని ఆశ్రయించగా అందరి సమస్యలు విని సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పిర్యాదుదారుల వివరాలు, వారి సమస్యలను తెలియపరచి, తగుచర్యలు తీసుకోవలసిందిగా మరియు ఫిర్యాదిదారులకు చట్ట పరిధిలో సత్వర న్యాయం అందించవలసిందిగా ఆదేశించారు. ఈ స్పందన కార్యక్రమం లో సివిల్ సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేయబడిన లీగల్ ఎయిడ్ క్లినిక్, ప్యానల్ అడ్వకేట్, బీవీ శివరామకృష్ణ సోమవారం స్పందన కార్యక్రమం లో పాల్గొన్నారు. కార్యక్రమం లో ప్రకాశం జిల్లా అడిషనల్ ఎస్పీ రవి చంద్ర , ఓ ఎస్ టి కె.చౌడేశ్వరి, డి.ఎస్.పి, బి.మరియాదాసు, ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.

## డప్పు కళాకారులకు పనిముట్లు అందజేసిన ఎమ్మె ల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు



నందిగామ, సెప్టెంబరు 06, ప్రజాపాలన ప్రతినిధి: పట్ట ణం లోని మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటుచేసి న కార్యక్రమంలో లబ్ధిదారులైన డప్పు కళాకారులకు శాసనసభ్యులు డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రా వు ప్రభుత్వం అందజేసిన పనిముట్లను అందజేశా రు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డప్పు కళాకా రుల సంక్షేమం, అభివృద్ధికి ముఖ్యమంత్రి వైయస్ జ గన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తుందని ,అందు లో భాగంగానే వారికి పింఛన్లను మంజూరు చేయడం తో పాటు వారు కోరిన విధంగా అవసరమైన పనిము ట్లు డప్పులు ,గజ్జలు, ఏకరీతి వస్త్రాలను మరియు ఇ తర పనిముట్లను ప్రభుత్వం అందజేస్తుందని తెలిపా రు ,సమాజంలోని బడుగు బలహీన వెనుకబడిన వ ర్గాల ప్రజల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జ గన్ సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలుచేస్తు న్నా రని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ,పార్టీ నా యకులు నానయ్య ,కళాకారుల సంక్షేమ బోర్డు అధి కారులు ,వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొ న్నారు.



## రాష్ట్ర ప్రజానీకం పై పన్నుల మీద పన్నులే పన్నులు: తంగిరాల సౌమ్య

నందిగామ, 06 సెప్టెంబర్ ప్రజాపాలనప్రతినిధి:పట్ట ణం రైతుపేట పెట్రోల్ బంక్ నందు సి.పి.ఐ పార్టీ కా ర్యాలయం నందు స్థానిక తెదేపా నేతలు మరియు అ ఖిలపక్ష పార్టీల నాయకులతో కలిసి రౌండ్ టేబుల్ మీ టింగ్ లో మాజీ శాసనసభ్యురాలుతంగిరాల సౌమ్య పాల్గొని మాట్లాడుతూరాష్ట్రము అప్పుల్లో కూరుకు పోయిందన్నారుఈ రెండున్నర ఏళ్లలో రాష్ట్ర ప్రజానీ కానికి మీరు ఎం చేసారనిప్రశ్నించారు.ఒక రోడ్ వేశా రా, చాలా ప్రతిషాత్మకంగా తెలుగుదేశం హయాంలో అన్ని ఏర్పాట్లతో పూర్తి అయిన టిటికో ఇళ్లను లబ్ధి దారులకు ఇవ్వకుండా వాటిని శిథిలావస్థకు చేర్చా రన్నారుడబ్బులు కట్టినా లబ్ధిదారులు రోడ్డునా పడ్డా రు.ఇప్పటికైనా గ్రామాల వారీగా, పట్టణలా వారీగా సామాన్య ప్రజానీకం పై పన్నుల మోతాను రాష్ట్ర ప్ర భుత్వం నిలిపివేయాలని ఆమె డిమాండ్ చేసారు.

# విఘ్నాలను ప్రారద్రోలే విఘ్నేశ్వరుడి జన్మదినమే వినాయక చవితి: మాజీ శాసనసభ్యురాలు తంగిరాల సౌమ్య

నందిగామ, సెప్టెంబరు 06, ప్రజాపాలన ప్రతినిధి: రానున్న వినాయక చవితి పండుగను పురస్కరించుకొని పట్ట ణ కూడలులలో పందిళ్ళ ఏర్పాటు మరియు విగ్రహా లకు అనుమతి ఇవ్వాలని కోరుతూ స్థానిక తెదేపా నే తలు, ఆర్, ఎస్.ఎస్ బిజెపి పార్టీలకు అతీతంగా సో మవారం ఉదయం తసీల్దార్ కార్యాలయంలో మాజీ శాసనసభ్యురాలు తంగిరాల సౌమ్య డిటికి వినతిప త్రం అందజేశారుఅనంతరం ఆమె మాట్లాడుతూరా ష్ట్ర ప్రభుత్వం ఏదైతే నిర్ణయం తీసుకుందో గణపతి ఉ త్సవాలను ఎవరి ఇళ్లకు వాళ్ళు పరిమితమై చేసుకో వాలని ఆదేశాలు జారీ చేయడం చాలా విచారకరం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీరు చాలా హాస్యాస్ప దంగా ఉన్నది. కరోనా నిబంధనల వలన అనుమతు లు ఇవ్వలేమని చెప్తున్నారు.గత నెల రోజులుగా చి న్న పిల్లలకు స్కూల్స్ నడుపుతున్నారు.కరోనా నిబం ధనలు చిన్న పిల్లలకు వర్తించవా?వైన్ షాపులు చూస్తే మహాసభలు జరిగినట్లే ప్రజలు బారులు తీరి ఉంటు న్నారు.అక్కడ వర్తించవా కరోనా నిబంధనలు?ఏం నిర్ణయం తీసుకున్న కొంతమంది మనోభావాలు దెబ్బ తీసే విధంగా ప్రభుత్వం వ్యవహరించ కూడదన్నారు. భారతదేశం అంటే సెక్యులర్ దేశం ప్రతి మతం వారి ని వారి సంప్రదాయాలను గౌరవించే విధంగా ఉండా లికొంతమంది మతాలను కించపరిచే విధంగా నిర్ణ యాలు తీసుకోవడం చాలా విచారకరం.రాజశేఖర్ రెడ్డి జయంతి ఉత్సవాలలో ప్రతి గ్రామాన వందలాది మంది ప్రజల సమూహాలతో ఉత్సవాలు నిర్వహిం చారు. అక్కడ వర్తించవా ఈ కరోనా నిబంధనలు?సంవత్సరం పొడవునా గణపతి ఉత్సవాలు అంటేనే బొమ్మల



తయారీ వారు,పూజారులు, మండపాలు ని ర్మించేవారు,పూల వారు,సెంట్రింగ్, లైటింగ్ ఇలా అనేక రకాల కూలీలు ఉపాధి కోసం వేచి చూస్తూ ఉంటా రు.ఆ కూలీలను నడి రోడ్డున పడేశారు, వారి పొట్ట కొడు తుంది ఈ రాష్ట్ర ప్రభుత్వం.రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి కైనా వారి నిర్ణయాలను వెనక్కి తీసుకోవాలని ఈ సం దర్భంగా ఆమె రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## ద్వారాకాతిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే



ఏలూరు, సెప్టెంబరు 06, ప్రజాపాలన ప్రతినిధి: ఆంద్రప్రదేశ్ రాష్ట్ర విత్తనాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పి హేమసుస్మిత దెందులూరు.ఉ ంగుటూరు శాసనసభ్యులు కొఠారు అబ్బయ్యచౌదరి.పుప్పాల వాసుబాబు సోమవారం ద్వారాకాతిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామివారిని దర్శించుకున్నారు.వారికి ఆలయ ఈ ఓ సుబ్బారెడ్డి ఆలయ సిబ్బంది ఘనస్వాగతం పలికారు.ఈ సందర్భంగా స్వామివారి దర్శనానికి వచ్చిన ప్రజా ప్రతినిధులకు ఆలయ ఈ ఓ ఆలయ మర్యాదలతో స్వామివారి వస్త్రాలను అందజేసి ఆలయ ప్రధాన వెడపండితులతో పూజలు జరిపించి ఆశీర్వదించారు.....

## గ్రామ సచివాలయ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి: ఎంపిడిఓ కు వినతి



పొన్నూరు, సెప్టెంబర్6 ప్రజా పాలన ప్రతినిధి: గ్రామ సచివాలయ ఉద్యోగులకు పరీక్షలు రద్దు చేసి, ప్రభుత్వ హామీ మేరకు పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం మండలంలోని అన్ని సచివాలయ ఉద్యోగులు పొన్నూరు ఎంపిడిఓ అత్తోట దీప్తికి వినతిపత్రం సమర్పించారు. గ్రామ సచివాలయ ఉద్యోగస్తులకు గతంలో ప్రభుత్వ హామీ మేరకు పరీక్షలు నిర్వహించకుండ ప్రొబేషన్ డిక్లెర్ చేసి పర్మనెంట్ చేయాలని కోరారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ సచివాలయ వ్యవస్త ఏర్పడిన దగ్గర నుండి పగలనక, రాత్రనక ఎన్నో ప్రయాసలు పడి ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన నవరత్నాలలో బాగంగా ప్రతి పథకాన్ని ప్రజలకు సకాలంలో అందిస్తూ, రాజకీయ ఒత్తిడులను ఎదుర్కొంటూ సెలవు దినాలు అనేది లేకుండా పతీ లబ్దిదారుల నుండి బయోమెట్రిక్ లు వేయించుకుంటూ ఎంతో కష్టపడి పని చేస్తున్నది సంక్షేమ మరియు విద్యా సహాయకులమైన తామే నన్నారు. అలాంటి మాకు రేపటి రోజున ఎంతో అన్యాయం జరగబోతున్న దని ఆందోళన వ్యక్తం చేశారు. మొదట సంక్షేమ మరియు విద్యా సహాయకులకు డిపార్ట్మెంట్ పరీక్షలే లేవని ప్రభుత్వం చెప్పిందని ఉ టంకించారు. సచివాలయ వ్యవస్త లోని మిగతా డిపార్ట్మెంట్ వారికి నామమాత్రంగా బుక్స్ చూసుకుని, మూడు సార్లు పరీక్షలు రాసేందుకు అవకాశం ఇచ్చారని, కాని సంక్షేమ మరియు విద్యా సహాయకులైన మాకు ఒకే ఒక అవకాశం ఇస్తూ అదీ బుక్స్ చూడకుండ పరీక్షలు రాయమని చెప్పడం దారుణమన్నా రు. మాకు 15రోజులు కూడ పరీక్షలు రాసేందుకు వ్యవది లేకుండ డిపార్ట్మెంట్ సర్వీస్ రూల్స్ లో లేని నిబంధనను కొత్తగా రూపొందించి పరీక్ష రాయాల్సిందే నని ప్రకటించడం అన్యాయ మన్నారు. ప్రభుత్వం వెంటనే పరీ క్ష లు రద్దు చేసి ప్రొబేషన్ డిక్లెర్ చేయవలసిందిగా సంక్షేమ మరియు విద్యా సహాయకులు పాల్గొన్నారు.

## పౌష్టికాహార మాసోత్సవాల ర్యాలీ




పొన్నూరు, సెప్టెంబర్6 ప్రజాపాలన ప్రతినిధి:పౌష్టికాహార మాసోత్సవాల లో భాగంగా డెఫ్ పేట బాలికల పాఠశాలలో సైకిల్ ర్యాలి సోమవారం జరిగింది. ఈ ర్యాలీ ప్రారంభిస్తూ ప్రధానోపాధ్యాయురాలు జ్యోతిర్మయి మాట్లాడుతూ విద్యార్థులు, గర్భిణీలు, బాలింతలు పౌష్టికాహారం తప్పక తీసుకొని ఆరోగ్యవంతంగా ఉండాలని సూచించారు పౌష్టికాహార మాసోత్సవం ప్రాధాన్యతను ర్యాలీలో ప్రజలకు వివరించారు. విద్యార్థులతోపాటు వ్యాయామ ఉపాధ్యాయులు ఉమా, అంగన్వాడీ కార్యకర్త %ూ% . శ్రీదేవి పాల్గొన్నారు.

# నరసరావుపేట పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుదాం



నరసరావుపేట,సెప్టెంబరు 06, ప్రజాపాలన ప్రతినిధి: నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు నరసరావుపేట పట్టణాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే ఒక మంచి పర్యావరణ పట్టణంగా రూపొందించడం లో భాగంగా నరసరావుపేట పట్టణ ప్రజలకు, వ్యాపార సంస్థల వారికి, మాంసం దుకాణాలు వారికి,కొబ్బరి బొండాం ల వ్యాపారస్తులకు, కూరగాయల వ్యాపారస్తులకు, మెడికల్ వ్యాపారస్థులకు, ఫంక్షన్ హాళ్లు, కళ్యాణ మండపాల వారికి మరియు చుట్టుప్రక్కల ఉ న్నటువంటి రూరల్ పరిసర ప్రాంత వ్యాపారస్తులకు విజ్ఞప్తి మీ వ్యాపార సంస్థల్లో వచ్చేటటువంటి వ్యర్థాలను తడి చెత్త పొడి చెత్త వేరు చేసి పురపాలక సంఘం వారికి అందించవలసినదిగా, అదేవిధంగా హెూటల్స్, రెస్టారెంట్ లు, కళ్యాణ మండపాలు, ఫంక్షన్ హాల్స్ మరియు అపార్ట్మెంట్లలో వచ్చేటటువంటి బల్క్ వెస్ట్ ను ప్రైవేట్ ఏజెన్సీ ట్రాక్టర్స్ లకు అందించవలనినదిగా, కూరగాయల వ్యాపారస్తులు వ్యర్థాలను పురపాలక సంఘం ట్రాక్టర్ లకు అందించవలసినదిగా, చికెన్ మరియు మటన్ వ్యాపార సంస్థల వారు తమకు వచ్చేటటువంటి వేస్టేజ్ మీకు ప్రతి రోజు తీసుకెళ్ళి అటువంటి వాహనాల వారికి అందించవలనినదిగా తెలియజేయడమైనది అట్లు భిన్నంగా పట్టణంలో బహిరంగ ప్రదేశాల్లో అదేవిధంగా పట్టణ చుట్టూ ఉన్నటువంటి ప్రధాన రహదారులు మెయిన్ రోడ్,చిలకలూరిపేట రోడ్డు, డంపింగ్ యార్డ్ వద్ద, వినుకొండ రోడ్డు, సత్తెనపల్లి రోడ్డు, పల్నాడు రోడ్డు, గుంటూరు రోడ్డు, బైపాస్ రోడ్లపై వ్యర్థాలను వేయడం గమనించడం జరిగినది, ముఖ్యంగా రాత్రిపూట వేళలో వివిధ వ్యాపార సంస్థల వారు వ్యర్థాలను వాహనాల ద్వారా హైవే మీద పోయడం వల్ల పర్యావరణానికి హాని కలగడమే కాకుండా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. కావున పురపాలక సంఘం వారి ఆధ్వర్యంలో అన్ని ప్రదేశాల నందు నిఘా టీమ్స్ మరియు సి.సి.కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగినది, ఈ టీమ్స్ పగలు, రాత్రి రెండు పూటలా గస్తీ నిర్వహిస్తూ ఫొటోస్ తీయడం జరుగును కావున ప్రతి ఒక్కరూ ఒక మంచి పర్యావరణాన్ని ఏర్పాటు చేసే విధంగా ఒక సామాజిక బాధ్యత గా భావిస్తూ, నరసరావుపేట పట్టణాన్ని ఒక మంచి పర్యావరణ పట్టణంగా రూపొందించేందుకు పురపాలక సంఘం వారికి సహకరించ వలసినదిగా తెలియజేయడమైనది. కావున ఈ సందర్భంగా పట్టణ ప్రజలకు పురపాలక సంఘం వారి విజ్ఞప్తి ఏమనగా ఎవరైనా బహిరంగ ప్రదేశాలలో చెత్త వేస్తున్నట్లు అయితే మీరు మీ మొబైల్ ఫోన్ నందు ఒక ఫోటో తీసి ఇ పురపాలక సంఘం వారికి అందించినట్లయితే తగిన పారితోషికం ఇవ్వబడును. కావున ప్రతి ఒక్కరూ పురపాలక సంఘం వారి సూచనలు పాటించి వలసినదిగా అట్లు భిన్నంగా ప్రవర్తించిన వారిపై పర్యావరణ చట్టాల సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, జరిమానా విధించి ఆ వాహనాలను సీజ్ చేయడం జరుగునని హెచ్చరించడమైనది అని మునిసిపల్ కమిషనర్ కె.రామచంద్ర రెడ్డి తెలియజేశారు. ఈరోజు వినుకొండ రోడ్డు నందు వస్తే నిర్వహిస్తున్న పురపాలక సంఘం టీమ్స్ కు ఇతర ప్రాంతాల నుండి వెస్ట్ అరటిపండ్లు ఆకులు ఒక టాటా వ్యాన్ నందు జుత్తుకు వచ్చి చి ప్రధాన రహదారి పక్కన డంపు చేస్తుండటం గమనించి పడుకోవడం జరిగినది వెంటనే 10,000/- వేల రూపాయల జరిమానా విధించి మరోసారి ఈ విధంగా చేసినట్లయితే వాహనం సీజ్ చేసి కేసు పెట్టడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ కె రామచంద్ర రెడ్డి తెలియజేశారు. సదరు కార్యక్రమంలో లో మున్సిపల్ డిప్యూటీ ఇంజనీర్ ఓలేటి శ్రీనివాస రావు , మున్సిపల్ ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ దేవిక ,. ఇంచార్జ్ శానిటేషన్ ఇన్స్పెక్టర్ వెంకట స్వామి మరియు మున్సిపల్ నిఘా సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా మలిశెట్టి జన్మదిన వేడుకలు



కావలి సెప్టెంబర్ 6 ప్రజాపాలన ప్రతినిధి :మాజీ ఎఎంసి చైర్మన్ మల్లిశెట్టి జన్మదిన వేడుకలు మన్నవ రవిచంద్ర ఆధ్వర్యంలో సోమవారం టిడిపి కార్యాలయంలో ఘనంగా జరుపుకున్నారు.రాష్ట్ర నలుమూలల నుండి బాలకృష్ణ ,జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు ,రాజకీయ నాయకులు పాల్గొని గజ మాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కండ్లకుంట మధు బాబు నాయుడు ,గుత్తికొండ కిషోర్ బాబు, ఏగూరి చంద్రశేఖర్ ,రాజ్ కుమార్ చౌదరి ,తటవర్తి వాసు ,దావులూరి దేవకుమార్ ,మంచాల ప్రసాద్ ,కుందుర్తికిరణ్ ,మల్లికార్జున్ రెడ్డి ,సూరి శెట్టి రామకృష్ణ, మైనంపాటి జగదీష్, కావేటి చిన్న కోటయ్య , శివ కుమార్ , పల్లపు కుమార్ ,మోహన్ ప్రసాద్, కోసూరి సురేష్ ,లింగం మాల్యాద్రి, నేలపాడు మాల్యాద్రి, రమణయ్య , పొన్నతి భాస్కర్ ,వెంకట్రావు మనీ, మరియు రూరల్ మండలం కోసూరివెంకటేశ్వర్లు, జాల రావు రాజేంద్రప్రసాద్ ,వెంకట్రావు, మల్లికార్జున, జంపని వంశీ గౌడ్, వెంకట రమణయ్య ,కొత్తపల్లి మాల్యాద్రి ,పాటిబండ్ల వెంకటేశ్వర్లు, మరియు జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ గునుపూడి కృష్ణ, కమల్ దావులూరి రమేష్ అశోక్, హరిబాబు, మొదలగు వారు పాల్గొన్నారు.

## నేడే సెయింట్ ఆన్స్ కళాశాలలో ఎచీవర్స్ డే వేడుకలు

వేటపాలెం, సెప్టెంబర్ 6 (ప్రజాపాలన ప్రతినిధి): ప్లేస్‌మెంట్ ఆఫర్‌లు, ఇంటర్న్‌షిప్, గేట్ ర్యాంకులు సాధించిన విధ్యార్థులను సన్మానించడానికి ది. 07-9-2021 మంగళవారము కళాశాల ప్రాంగణంలో ఎచీవర్స్ డే వేడుకలు నిర్వహిస్తునట్లు కళాశాల సెక్రటరి వనమా రామకృష్ణారావు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రకాశం జిల్లా ఎస్పి శ్రీమతి మాలికా గార్గ్ పాల్గొంటారని కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణ రావు అన్నారు. ఈ సందర్భంగా సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ %డ% టెక్నాలజీ చీరాల ప్రధాన ఆచార్యులు మొయిద వేణుగోపాలరావు మాట్లాడుతూ తమ కళాశాల రాష్ట్రంలోని అత్యుత్తమ విద్యావేత్తలతో విద్యార్థులను విజయ శిఖరాలను అధిరోహించడానికి ఉత్తమ మార్గదర్శకాలను అందిస్తుందన్నారు. కళాశాలలో ఉన్న అధునాతన సౌకర్యాలు, ఆధునిక ల్యాబరేటరీలతో విద్యార్థులు తమ విజయ లక్ష్యం సాధించడం జరిగిందన్నారు.

## గుంటూరు ఛానెల్ పొడిగింపు కోరుతూ పర్చూరులో భారీ ర్యాలీ




పర్చూరు(ఒంగోలు),సెప్టెంబరు 06, ప్రజాపాలన ప్రతినిధి: గుంటూరు ఛానల్ ను పర్చూరు వరకు పొడిగించాలని డిమాండు చేస్తూ నల్లమడ రైతుసంఘం ఆధ్వర్యంలో సోమవారం పర్చూరులో భారీ ప్రదర్శన జరిగింది. బొమ్మల సెంటర్ నుండి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ సాగింది. చాలాకాలంగా ఈ ప్రతిపాదన పెండింగ్ లో ఉ ండిపోయిందని రైతు సంఘాల నేతలు ఈ సందర్బంగా విమర్శించారు. ఈ పథకానికి దాదాపు మూడు వందల కోట్ల రూపాయలు అవసరం అవుతాయని వారు చెప్పారు.ఇది కార్యరూపం దాలిస్తే, పర్చూరు నియోజకవర్గంలో దాదాపు 50గ్రామాలకు తాగునీరు, సాగునీరు సమృద్ధిగా లభిస్తుందన్నారు. గతంలో పలువురు పాలకులు, ఈ ప్రతిపాదనలను పరిశీలించారు తప్ప అమలు చేయలేదని వారు తెలిపారు.ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్ రైతు రాజ్యాన్ని ఆవిష్కరిస్తానని చెబుతున్న నేపథ్యంలో, ఆయన అయినా సరే ఈ ప్రతిపాదనను కార్యాచరణలకు తేవాలని వారు కోరారు. పార్టీలకతీతంగా పలువురు నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కొల్లా రాజమోహన్, శ్రీనివాసరావు, కోట హరిప్రసాద్ తదితరులు నాయకత్వం వహించారు.

## ఉద్యోగాలకు 29 మంది ఎంపిక



నరసరావుపేట, సెప్టెంబరు 06, ప్రజాపాలన ప్రతినిధి: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ఉద్యోగ మేళా స్థానిక వాసవి డిగ్రీ కళాశాలలో నిర్వహించారు, ప్రభుత్వ ఆదేశాలు మేరకు నిరుద్యోగ సమస్యను రూపుమాపడానికి కృషి చేస్తున్నట్లు జిల్లా నైపణ్యాభివృద్ధి అధికారి షేక్.బాజాబుబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నైపుణ్యాభివృద్ధి సంస్థ, వాసవి డిగ్రీ కాలేజి సంయుక్తముగా నిర్వహిండం జరిగినదని తెలిపారు. ఈ కార్యక్రమములో కాలేజి మేనేజ్ మెంట్ భూమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కాలేజీ ప్రిన్సిపల్ ఎవియస్ రత్నకుమారి ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు, ఉద్యోగ మేళాకు ఎయిర్ టెల్ పేమెంట్స్ బ్యాంక్, యాక్సెస్ సెక్యూరిటీస్, క్వెస్, ఫ్లిప్ కార్ట్, వంటి నాలుగు కంపెనీలు పాల్గొన్నాయని. ఈ మేళాకు మొత్తం 77 మంది హాజరుకాగా 29 మంది ఎంపిక అయ్యారు అని అయన తెలిపారు,ఎంపిక అయిన యువతి యువకులకు షేక్ బాజిబాబు శుభాకంక్షలు తెలిపారు, ఎంపిక కాబడిన వారికి నియమాక పత్రాలు అందజేసారు. ఈ కార్యక్రమములో నరసరావుపేట ఏరియా స్కిల్ డెవలప్ మెంట్ కోఆర్డినేటర్ విసిహెచ్.రామాంజనేయులు, శ్రీకాంత్ లు పాల్గొన్నారు.




## సంపత్ నంది స్క్రీన్ ప్లే పై మెగా ప్రశంస



మెగాస్టార్ చిరంజీవి అంతటి వారు ఒక యువదర్శకుడి స్క్రీన్ ప్లేని మెచ్చారంటే ఎంతో విషయం ఉంటే కానీ సాధ్యం కానిది. కానీ యువదర్శకుడు సంపత్ నంది స్క్రీన్ ప్లేపై మెగాస్టార్ స్వయంగా ప్రశంసలు కురిపించారు. సంపత్ ఇంతకుముందు చరణ్ హీరోగా రచ్చ లాంటి విజయవంతమైన మాస్ ఎంటర్ టైనర్ ని తెరకెక్కించిన సంగతి తెలిసిందే. ఆ చిత్రం స్క్రీన్ ప్లే మెగాస్టార్ ని మెప్పించింది. బహుశా అందుకే ఇప్పుడు సంపత్ తెరకెక్కించిన సీటీమార్ విజయం సాధించాలని దీవిస్తూ అతడి స్క్రీన్ ప్లేని ప్రశంసించారు. సీతిమార్ ట్రైలర్ చూసిన తర్వాత ఆకట్టుకుందని మెగాస్టార్ చిరంజీవి అన్నారు. సీటీమార్ విజయం సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు. చిరంజీవి మాట్లాడుతూ నేను ఇప్పుడే సీటీమార్ ట్రైలర్ చూశాను. ఇది ఆకట్టుకుంటుంది. ఈ చిత్రం గ్రామీణ క్రీడ కబడ్డీ నేపథ్యంలో బావుంది. నాకు చాలా కాలంగా సంపత్ నంది తెలుసు. అతను కథనంలో మంచి పనిమంతుడు. ఈ సినిమాలో గోపీచంద్- తమన్నా కీలక పాత్రలు పోషించారు. సినిమా కోసం కొత్త అమ్మాయిల సమూహానికి కబడ్డీలో శిక్షణ ఇచ్చారు. ముఖ్యంగా టోక్యో ఒలింపిక్స్ లో మన తెలుగమ్మాయిలు గెలిచిన సమయంలో అలాంటి కథలతో కూడిన సినిమాలు చాలా అవసరం. నేను ఇటీవల ఒలింపిక్ విజేత పివి సింధును సత్కరించాను. మహిళల విజయం పట్ల భారతదేశం గర్వపడుతుంది. మహిళలు కబడ్డీ ఆడితే ఎలా ఉంటుందనేది సీటీమార్. చివరకు వారు ఎదుర్కొంటున్న అడ్డంకులు .. అవమానాలు ఎలాంటివో సినిమాలో చూడాలి. ఇలాంటి సినిమాలు వచ్చి అందరినీ చైతన్యపరచాలి. సంపత్ కి చిత్ర బృందానికి శుభాకాంక్షలు అని తెలిపారు. కబడ్డీ నేపథ్యంలో తెరకెక్కిన ఈ చిత్రానికి సంపత్ నంది దర్శకత్వం వహించారు. జ్వాలారెడ్డి అనే ఎనర్జిటిక్ గాళ్ పాత్రలో తమన్నా నటిస్తుండగా.. దిగంగన సూర్యవంశీ రిపోర్టర్ పాత్రను పోషిస్తుంది. మణిశర్మ సంగీతం అందించారు. శ్రీనివాస సిల్వర్ స్క్రీన్ సంస్థ నిర్మించింది. ఇది సెకండ్ వేవ్ ముందు రిలీజ్ కావాల్సి ఉన్నా వాయిదా పడింది. ఈనెల 10 న విడుదల కానుంది.

## వినాయక చవితికి 'ఖిలాడి' మ్యూజిక్ ఫెస్ట్..!





మాస్ మహారాజా రవితేజ హీరోగా నటిస్తున్న లేటెస్ట్ మూవీ "ఖిలాడి". 'రాక్షసుడు' ఫేమ్ రమేష్ వర్మ దర్శకత్వంలో ఈ హై వోల్టేజ్ యాక్షన్ ఎంటర్టైనర్ తెరకెక్కుతోంది. రవితేజ ద్విపాత్రాభినయం చేస్తున్న ఈ చిత్రంలో మీనాక్షి చౌధరి - డింపుల్ హయతి హీరోయిన్లుగా నటిస్తున్నారు. 'క్రాక్' వంటి బ్లాక్ బస్టర్ మాస్ రాజా నుంచి వస్తున్న ఈ చిత్రంపై మంచి అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే ఫస్ట్ లుక్ - ఫస్ట్ గ్లిమ్స్ - టీజర్ విశేష స్పందన తెచ్చుకున్నాయి. ఈ క్రమంలో వినాయక చవితి సందర్భంగా మ్యూజిక్ ఫెస్టివల్ స్టార్ట్ చేయబోతున్నట్లు మేకర్స్ ప్రకటించారు. 'ఖిలాడి' చిత్రం నుంచి 'ఇష్టం' అనే ఫస్ట్ సింగిల్ ని సెప్టెంబర్ 10న రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ వెల్లడించారు. ఈ సందర్భంగా హీరోయిన్ తో కలిసి స్టెప్పులేస్తున్న రవితేజ పోస్టర్ ని వదిలారు. హీరోహీరోయిన్ల మధ్య సాగే ఈ రొమాంటిక్ సాంగ్ ప్రోమోని ఇటీవల విడుదల చేయగా.. మంచి స్పందన తెచ్చుకుంది. ఈ క్రమంలో మరో నాలుగు రోజుల్లో ఫుల్ సాంగ్ ని రిలీజ్ చేయనున్నారు. రాక్ స్టార్ దేవిశ్రీప్రసాద్ ఈ సాంగ్ కు ట్యూన్ కంపోజ్ చేశారు. దేవిశ్రీ తమ్ముడు సాగర్ డైలాగ్స్ రాస్తున్నారు. సుజిత్ వాసుదేవ్ మరియు జి.కె. విష్ణు ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. సౌత్ ఇండస్ట్రీలోని నలుగురు టాప్ ఫైట్ మాస్టర్లు రామ్-లక్ష్మణ్ మరియు అన్బు-అరివు మాస్టర్స్ 'ఖిలాడి' చిత్రానికి యాక్షన్ కొరియోగ్రఫీ చేస్తున్నారు. ఇందులో యాక్షన్ కింగ్ అర్జున్ - అనసూయ - ముఖేష్ రుషి - వెన్నెల కిషోర్ - రావు రమేష్ - మురళీ శర్మ ఇతర పాత్రలు పోషిస్తున్నారు. పెన్ స్టూడియోస్ జయంతీలాల్ గడ సమర్పణలో హవీష్ ప్రొడక్షన్స్ బ్యానర్ పై సత్యనారాయణ కోనేరు ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. షూటింగ్ చివరి దశలో ఉన్న ఈ చిత్రాన్ని త్వరలో ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు.

## మళ్ళీ మారేడుమిల్లి కి పుష్పరాజ్..!



అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న యాక్షన్ డ్రామా "పుష్ప". శేషాచలం అడవుల్లో ఎర్రచందనం స్మగ్లింగ్ నేపథ్యంలో ఈ సినిమా రూపొందుతోంది. తూర్పు గోదావరి జిల్లాలోని మారేడుమిల్లి అభయారణ్యంలో సినిమాలోని ఎక్కువ భాగం షూటింగ్ జరిగింది. ఈ క్రమంలో 'పుష్ప' టీమ్ మరోసారి మారేడుమిల్లి కి వెళ్ళింది. ఇటీవల పూర్తైన హైదరాబాద్ షెడ్యూల్ లో హీరో విలన్ల మధ్య కీలక సన్నివేశాలను చిత్రీకరించారు. ఇప్పుడు ఫారెస్ట్ బ్యాక్ డ్రాప్ లో తీయాల్సిన యాక్షన్ సీన్స్ కోసం మళ్ళీ అక్కడికే వెళ్లారని తెలుస్తోంది. పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న 'పుష్ప' చిత్రాన్ని రెండు భాగాలుగా విడుదల చేస్తున్నారు. ఫస్ట్ పార్ట్ ని 'పుష్ప: ది రైజ్' పేరుతో క్రిస్మస్ సీజన్ లో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే మెజారిటీ భాగం షూటింగ్ కంప్లీట్ చేసిన చిత్ర బృందం.. సెప్టెంబర్ చివరి నాటికి టాకీ మొత్తాన్ని పూర్తి చేయాలని ప్లాన్ చేస్తున్నారు. మారేడుమిల్లి షెడ్యూల్ తర్వాత హైదరాబాద్ లో జరిగే మరో షెడ్యూల్ తో చిత్రీకరణ పూర్తవుతుందని సమాచారం. 'పుష్ప' చిత్రంలో రష్మిక మందన్నా హీరోయిన్ గా నటిస్తుండగా.. మలయాళ నటుడు ఫహాద్ ఫాజిల్ విలన్ గా కనిపించనున్నారు. ప్రకాష్ రాజ్ - జగపతిబాబు - ధనుంజయ్ - అజయ్ - సునీల్ - అనసూయ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. రాక్ స్టార్ దేవిశ్రీ ప్రసాద్ ఈ చిత్రానికి సంగీతం సమకూరుస్తున్నారు. మిరోస్లా కుబా బ్రోజెక్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా.. ఆంటోనీ రూబెన్ ఎడిటింగ్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. రసూల్ పూకుట్టి సౌండ్ డిజైనింగ్ చేస్తున్నారు. ఇప్పటికే విడుదలైన హీరో విలన్ల ఫస్ట్ లుక్స్ - టీజర్ - 'దాక్కో దాక్కో మేక' సాంగ్ విశేష స్పందన తెచ్చుకున్నాయి. లారీ డ్రైవర్ పుష్పరాజ్ గా ఊర మాస్ లుక్ లో బన్నీ అలరించనున్నారు. ఐపీఎస్ భన్వర్ సింగ్ షెకావత్ గా ఫహాద్ ఫాజిల్ నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ - ముత్యంశెట్టి మీడియా బ్యానర్స్ పై నవీన్ ఎర్నేని - వై రవిశంకర్ భారీ బడ్జెట్ తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

## క్రిష్ తర్వాత ఇన్నాళ్టికి మరో సూపర్ హీరో పుట్టుకొచ్చాడా?




ప్రాంతీయ భాషల్లో సూపర్ హీరో సినిమాలేవీ లేవు. సూపర్ హీరో సినిమా అంటే భారతదేశంలో ఇప్పటివరకూ క్రిష్ ఫ్రాంఛైజీ మాత్రమే. హృతిక్ ని మాత్రమే సూపర్ హీరోగా చూస్తారు. కానీ ఇప్పుడు మలయాళంలో సూపర్ హీరో పుట్టుకు రావడం ఉత్కంఠను పెంచుతోంది. మిన్నల్ మురళి- టోవినో థామస్ నేతృత్వంలోని మలయాళ సూపర్ హీరో సినిమా నెట్ ఫ్లిక్స్ లో ట్రీమింగ్ కానుంది. ప్రపంచంలోని అతి పెద్ద సబ్స్క్రిప్షన్ ఆధారిత వీడియో స్ట్రీమింగ్ సంస్థ నెట్ ఫ్లిక్స్ ఈ భారతీయ సూపర్ హీరో మూవీని కొనుగోలు చేసినట్లు ప్రకటించింది. ఇది నెట్ ఫ్లిక్స్ లో త్వరలోనే రిలీజవుతుందని వెల్లడించారు. మిన్నల్ మురళి అనేది ఈ సినిమా టైటిల్. ఒక సాధారణ వ్యక్తి (థామస్) మెరుపుల తాకిడికి గురై సూపర్ హీరోగా మారతాడు. ఫస్ట్ లుక్ చూడగానే.. ఇది షాజమ్ ని గుర్తు చేస్తుంది. కానీ భారతీయ వెర్షన్ సూపర్ హీరో అంటూ ప్రచారం సాగుతోంది. మిన్నల్ మురళి లోగో కూడా %ణఱ% కామిక్స్ సూపర్ హీరోల నుండి ప్రేరణ పొందడం ఆసక్తికరం.

ముడుచుకున్న ధోతి .. ఎర్రని కండువా అతని ముఖాన్ని కవర్ చేస్తూ ఆసక్తిని పెంచింది. బహుశా సూపర్ హీరోని కొంతవరకూ దాచే ప్రయత్నమే ఇది. ఆసక్తికరంగా ఆ ధోతీనే బిగుతుగా ఉండే సూపర్ హీరో కాస్ట్యూమ్ గా రూపాంతరం చెందుతోంది. నీలం - ఎరుపు రంగులతో ఆధిపత్యం చెలాయిస్తుంది. ఎరుపు ముసుగు చూస్తుంటే.. కోవిడ్ మాస్క్ లాగా అనిపిస్తుంది. మిన్నల్ మురళికి అతీంద్రియ శక్తి ఉంది తప్ప అతడి శక్తులు ఏ స్థాయిలో ఉపయోగిస్తాడు? అన్నదానిపై వివరం లేదు.

నేను మొదటి నుండి మిన్నల్ మురళి పాత్ర కోసం శ్రద్ధ వహించాను అని థామస్ తెలిపారు. నా డైరెక్టర్ బాసిల్ జోసెఫ్ తో ప్రతిదీ చర్చించాను. సాధ్యమైనంత ఉత్తమమైన ఫలితాన్ని అందించడానికి ప్రయత్నించాం. మిన్నల్ మురళిని రూపొందించడంలో మేం అపారమైన పని చేసాం. నేను చాలా నేర్చుకున్నాను. ఈ వింత సమయాల్లో నెట్ ఫ్లిక్స్ ద్వారా ప్రజలు తమ ఇండ్ల నుంచే వీక్షించే సౌలభ్యం కలిగినందుకు అందరూ అభినందిస్తున్నందుకు నేను కృతజ్ఞుడను. సినిమా చూసే ప్రతిఒక్కరూ మిన్నల్ మురళిని ఇష్టపడతారని ఆశిస్తున్నాను.. అన్నారు. థామస్ తో పాటు మిన్నల్ మురళి చిత్రంలో గురు సోమసుందరం (ఆరణ్య కాండం).. హరిశ్రీ అశోకన్ (ఊమపెన్నిను ఉరియాదప్పయ్యన్) .. అజు వర్గీస్ (వెల్లిమూంగ) కూడా నటించారు. జోసెఫ్ (గోధా) అరుణ్ అనిరుధన్ (పాదయోత్తం) - సోఫియా పాల్ నిర్మాతలు. ప్రజలు భావోద్వేగానికి గురయ్యేంతగా సంబంధం కలిగి ఉండే కనెక్ట్ అయ్యే ఒక సూపర్ హీరోని సృష్టించాలనుకున్నామని జోసెఫ్ సిద్ధం తాజా ప్రకటనలో తెలిపారు. ఒక సూపర్ హీరో సినిమా బలమైన కథనాన్ని కలిగి ఉండటంపై దృష్టి పెట్టాం. నేను విడుదల కోసం ఎదురు చూస్తున్నాను. ఇది మొత్తం టీమ్ కి ఒక డ్రీమ్ ప్రాజెక్ట్. సినిమా నెట్ఫ్లిక్స్లో విడుదలవుతున్నందుకు సంతోషంగా ఉంది.. అని నిర్మాత అన్నారు. స్థానిక సూపర్ హీరో: మిన్నల్ మురళి సిరీస్ గా మారేందుకు ఉత్తమ నటులు సాంకేతిక నిపుణుల బృందాన్ని తీసుకువచ్చాము. ఈ సూపర్ హీరో చిత్రం భాషా భేధాన్ని అధిగమిస్తుంది. ప్రధానంగా ఇది భావోద్వేగాలు ఉన్న మనిషి కథ. మిన్నల్ మురళి గురించి గర్వపడుతున్నాను. నెట్ ఫ్లిక్స్ తదుపరి మలయాళ చిత్రానికి చేతులు కలపడానికి మాకు అవకాశం లభించినందుకు సంతోషంగా ఉంది. మిన్నల్ మురళి ప్రారంభం మాత్రమే. మేము ఇప్పుడే ప్రారంభిస్తున్నాము.. అని నిర్మాత పాల్ అన్నారు. క్రిష్ ఫ్రాంఛైజీ తర్వాత సౌత్ సూపర్ హీరో ఎలాంటి ఆదరణ దక్కించుకుంటాడో వేచి చూడాలి.

## పోకిరి ఇలియానాలా మహేష్ తో జూ.ఇలియానా..!



సూపర్ స్టార్ మహేష్ బాబు కథానాయకుడిగా 28వ చిత్రానికి త్రివిక్రమ్ దర్శకత్వం వహిస్తున్న సంగతి తెలిసిందే. అతడు, ఖలేజా తర్వాత ముచ్చటగా హ్యాట్రిక్ కోసం మూడవసారి చేతులు కలిపారు. మహేష్ సక్సెస్ స్పీడ్... త్రివిక్రమ్ ఇండస్ట్రీ బ్లాక్ బస్టర్ రికార్డుల నడుమ ఈ కాంబినేషన్ పై భారీ అంచనాలే నెలకొన్నాయి. ప్రస్తుతం త్రివిక్రమ్ నటీనటులు...సాంకేతిక నిపుణుల ఎంపికలో తలమునకలై ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే మహేష్ సరసన మెయిన్ లీడ్ కి పూజా హెగ్డేని ఎంపిక చేసారు. ఈ నేపథ్యంలో ఇందులో మరో హీరోయిన్ గా నభా నటేష్ ని కూడా ఫైనల్ చేసినట్లు ప్రచారం సాగుతోంది. అదే నిజమైతే నభా కెరీర్ టర్న్ తీసుకోవడం ఖాయం. అగ్ర హీరోల సరసన ఛాన్స్ కోసం నభా ఎప్పటి నుంచో వెయిట్ చేస్తోంది. డిస్కోరాజా చిత్రంలో మాస్ రాజా రవితేజ సరసన నటించినా ఆ సినిమా వైఫల్యం వల్ల నభా ఆ తర్వాత తడబాటుతో నెట్టుకురాలేకపోయింది. ఫైగా ఇప్పటివరకూ మీడియం హీరోల సరసనే కొన్ని సినిమాలు చేసింది. ట్యాలెంట్ డె గాళ్ అయినా పూరి జగన్నాథ్ సైతం ఇస్మార్ట్ శంకర్ లో కొంత వరకే పరిమితం చేసారు. దీంతో అమ్మడు తనలో సిసలైన నటిని బయటకు తీసే ఫుల్ లెంగ్త్ స్కోప్ తనకు దక్కలేదు. మరి త్రివిక్రమ్ అయినా సెకెండ్ లీడ్ లో నటనకు ఆస్కారం ఉన్న పాత్ర ఇస్తారేమో చూడాలి. ప్రస్తుతం నభా నటేష్ యూత్ స్టార్ నితిన్ సరసన మాస్ట్రోలో నటిస్తోంది. ఇందులోనూ సెకెండ్ లీడ్ తరహాలోనే కనిపించనుంది. మెయిన్ గా విలన్ షేడ్ ఉన్న పాత్రలో తమన్నా నటిస్తోంది. ఆ రకంగా నభా నటేష్ ఇప్పటివరకూ సెకెండ్ లీడ్ లకే పరిమితమైంది. కనీసం ఇప్పటికి అయినా మాయావి చిత్రంలో నటనకు ఆస్కారం ఉన్న పాత్రలో కనిపిస్తుందేమో చూడాలి. మహేష్ తో కలిసి నటించడం కాబట్టి ఫోకస్ అయ్యే అవకాశం ఎక్కువగా ఉంది. మహేష్ సరసన జాన్వీ అనుకుంటే..!

ప్రతిసారీ రొటీన్ హీరోయిన్లతో మహేష్ విసిగివేసారిపోయారని కథనాలొచ్చాయి. అయితే పూజా హెగ్డే లేదంటే కియరా అద్వాణీ కుదరకపోతే రష్మిక మందన పేర్లు మాత్రమే వినిపిస్తున్నాయి. ఆ ముగ్గురూ ఇప్పటికే మహేష్ సరసన కథానాయికలుగా నటించేశారు. కొరటాల దర్శకత్వంలో భరత్ అనే నేను చిత్రంలో కియరా నటించగా.. పైడిపల్లి దర్శకత్వంలో మహర్షి చిత్రంలో పూజా హెగ్డే కథానాయికగా నటించింది. సరిలేరు నీకెవ్వరు చిత్రంలో రష్మిక కథానాయిక. మహేష్ ఆ ముగ్గురితో ఇప్పటికే రొమాన్స్ చేసేశారు కాబట్టి ఇప్పుడు త్రివిక్రమ్ తో సినిమా కోసం మరో కొత్త కథానాయికను తీసుకోవాలనుకున్నారు. ఆ క్రమంలోనే జాన్వీ కపూర్ ను తెలుగు తెరకు పరిచయం చేయాలని హారిక అండ్ హాసిని క్రియేషన్స్ బ్యానర్ ప్రయత్నాల్లో ఉందని కథనాలొచ్చాయి. జాన్వీ నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చేస్తే వెంటనే లాంచ్ చేయడమేనని కూడా అన్నారు. మహేష్ లాంటి అగ్ర హీరో సరసన అవకాశాన్ని బోనీకపూర్ కూడా ఎంకరేజ్ చేసేందుకు ఆస్కారం లేకపోలేదని ప్రచారమైంది. కానీ త్రివిక్రమ్ మాత్రం బుట్ట బొమ్మ పూజా హెగ్డే వైపు చూసారు. కియరా ఇతర భారీ చిత్రాలతో బిజీ అవ్వడం.. జాన్వీ కపూర్ బిజీ షెడ్యూల్స్ వగైరా కారణాలతో పూజానే ఫైనల్ చేస్తున్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇలాంటి క్రేజీ చిత్రంలో మరో నాయికగా నభని ఎంపిక చేయడం ఆసక్తిని పెంచుతోంది. నభా నటేష్ ని ఇప్పటికే జూనియర్ ఇలియానా అంటూ అభిమానులు పొగిడేస్తున్నారు. పోకిరిలో మహేష్ సరసన నటించిన ఇలియానా తీరుగా.. ఏదైనా మ్యాజిక్ చేస్తుందేమో చూడాలి.

మాస్టర్ కీ TV
(అంబేడ్కర్ TV)
జై భీం,
మీరు నాయకుడిగా ఎదగాలని అనుకుంటున్నారా...?
మీరనుకున్న వార్తలు రావాలని కోరుకుంటున్నారా...?
పెట్టుబడి లేకుండా ఆదాయం పొందాలని అనుకుంటున్నారా...?
మీరూ మీ అసెంబ్లీ నియోజకవర్గం లో
టీవీ ఛానల్ ఓనర్ గా కావాలని అనుకుంటున్నారా...?
అయితే రండి, కదలి రండీ
బహుజనాభివృద్దే.. దేశాభివృద్ధి అని నిరూపిద్దాం
1. ఈ దేశంలో ఉన్న ఫోర్త్ ఎస్టేట్ (మీడియా రంగం) బహుజనుల సమస్యల మీద ప్రచారం చేయడం లేదని మీ అందరికీ తెలుసు. దేశంలోనే మొట్ట మొదటిసారిగా విలేఖరులకు సామాజిక కార్యకర్తలకు, అంబేడ్కర్, పూలే సంఘం నాయకులకు, కనీసం 100 మంది తెలిసిన గ్రూపునాయకులకు టీవీ ఛానల్ ప్రతినిధిగా / యజమానిగా అవకాశం ఇవ్వబడును.
2. జీవిత కాలంలో ఆయా అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రతినిధిగా / యజమానిగా నియమించబడును.
3. ఆయా ప్రతినిధికి ప్రకటనల ఆదాయం (Advertising Revenue)లో ప్రకటనలపై 40% ఆదాయం ఇవ్వబడును.
4. వార్తలను స్వేచ్ఛాయుతంగా ప్రసారం (Telecast) చేసే వీలు కల్పించబడును.
సంప్రదించండి
Tel No: 9849031420, 9440918143, 94409 18371, 94400 53858, 93473 50692, 8008840506, 9440077239, 7798832998, 76600 27678.
Office: Ambedkar TV Channel, 3rd Floor, Dault Plaza, Main Road, Besides Bata Showroom, Lakdi ka pool, Hyderabad - 500004
E- mail : ambedkartvchannel2018@gmail.com www.ambedkartv.org

Printed,Published & Owned by: Sajja Dhananjaya Sarath, Printing at :SEHASAI PRINTERS, D. 3-88, CHANRA TEATRE, GOSALA MAIN ROAD PENAMALURU MANDAL, DIST KRISHNA , ANDHRAPRADESH.,Published at H.No. 5+-61-3,Rajendra Nagar,Seetham peta, Visakha patnam-16,Andhrapradesh,India. Editor: Sajja Dhananjaya Sarath. RNI:APTEL/2008/25531,Permitted for posting under concession rates of postage, Postal Registration No. VJ/189/2017-19,Email.editor.prajapalana@gmail.com